ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
మంగళవారం 17 డిసెంబరు 2024



హనుమకొండ వేయిస్తంభాల గుడిలో రుద్రేశ్వరుడికి మారేడు దళ అర్చన



స్వామి అమ్మవార్ల దృష్టి నేరుగా అన్నం రాశిపై పడేవిధంగా అర్ధ మండపంలో ఏర్పాటు చేసిన కుంభం

మల్లన్న స్వామికి దృష్టి కుంభం

- ధను సంక్రమణం సందర్భంగా నిర్వహణ
- ఆరు రోజుల అనంతరం ఆర్జిత సేవలు ప్రారంభం

6



హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రానికొచ్చిన అభ్యర్థులు

ముగిసిన గ్రూపు-2 పరీక్షలు

- హనుమకొండ జిల్లాలో 48.61శాతం, వరంగల్‌లో 45.69శాతం అభ్యర్థుల హాజరు
- ఒక్క నిమిషం ఆలస్యంతో పరీక్షకు దూరమైన అభ్యర్థి

6

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

- వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస పర్వం ఆరంభం
- జోరుగా తిరుప్పావై ప్రవచనాలు

8

భూమిలేని పేదలెందరో?



వ్యవసాయ కూలీలకు ఆర్థిక భరోసా అందజేతకు ప్రభుత్వం సన్నాహాలు

- ఏటా రూ.12వేలు ఇవ్వనున్న రాష్ట్ర సర్కారు
- తొలి విడతగా ఈనెల 28న రూ.6వేలు జమ చేయనున్నట్టు ప్రకటన
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 7.35లక్షల మందికి జాబ్‌కార్డులు
- భూమిలేని పేదలను గుర్తించేందుకు ఎలాంటి సర్వే చేయని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,89,787 మందికి రైతుభరోసా
- ఏటా వ్యవసాయ కూలీలు, రైతు భరోసాకు రూ.30వేల కోట్లు ఖర్చు



జిల్లా.. లబ్ధిపొందిన రైతులు	వరంగల్	హనుమకొండ	జనగామ	మహబూబాబాద్	భూపాలపల్లి	ములుగు	మొత్తం
	1,54,822	1,45,044	1,79,735	2,14,685	1,16,171	79,330	8,89,787

గత యాసంగిలో రైతు భరోసా లబ్ధిపొందిన ఉమ్మడి జిల్లా రైతులు..

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

భూమిలేని పేదలకు ప్రభుత్వం రూ.12వేల ఆర్థిక సాయానికి సన్నాహాలు చేస్తోంది. రెండు విడతల్లో పేదలకు ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే భూమిలేని పేదలను ప్రభుత్వం ఎలా గుర్తిస్తుందనేది ఉత్కంఠగా మారింది. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి అనేక సర్వేలు నిర్వహించినా భూమి లేని నిరుపేదల వ్యవసాయ కూలీల గురించి ప్రత్యేకంగా సర్వే ఎప్పుడూ నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో భూమిలేని పేదల గుర్తింపు ప్రక్రియపై పలు అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 7.35లక్షల గ్రామీణ ఉపాధిహామీ జాబ్‌కార్డులు ఉన్నాయి. అయితే వీటి ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారా? లేక ప్రస్తుతం రైతుభరోసా తీసుకుంటున్న వారు కాకుండా.. మిగతా వారికి సాయాన్ని అందిస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. వ్యవసాయ కూలీలకు ఇచ్చే సహయానికి అర్హులు ఎవరనేది ఆసక్తికరంగా మారింది.

కూలీలకు ఫస్ట్.. ఆ తరువాతే రైతుకు భరోసా

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రైతుభరోసాను ప్రకటించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరాకు యాసంగి, వానకాలం పంటలకు రెండు విడతల్లో రూ.10వేల ఆర్థిక సాయాన్ని రైతులకు అందించింది. అయితే తాము అధికారంలోకి వస్తే రైతుబంధు పథకం స్థానంలో రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. భరోసా ద్వారా రైతులకు ఎకరాకు రెండు విడతల్లో రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. అలాగే కౌలు రైతులకు కూడా ఇదే మొత్తాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. ఇక వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేల ఆర్థిక సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు గతేడాది డిసెంబరు 7న సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత యాసంగి పంటలకు సంబంధించి పాత పద్ధతిలోనే రైతులకు యాసంగి పంటకు ఎకరానికి రూ.5వేల చొప్పున సాయాన్ని అందించారు. అయితే వానాకాలం పంటలకు, ప్రస్తుతం ప్రారంభమైన రబీ పంటకు కాంగ్రెస్ ఇచ్చిన రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.15వేల చొప్పున ఇవ్వాల్సి ఉంది. అయితే భరోసా పథకాన్ని సంక్రాంతి నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. రైతు భరోసాకంటే ముందే వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీ మేరకు రూ.12వేల ఆర్థిక సాయాన్ని అందించాలని నిర్ణయించింది. రెండు విడతల్లో భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ.12వేల సాయాన్ని అందించనున్నారు. తొలి విడత రూ.6వేల సాయాన్ని

మిగతా 8వ పేజీలో...

గజ.. గజ..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్రమైన చలి

పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు.. వణుకుతున్న జనం



వాజేడులో చలిమంట కాగుతున్న యువకులు

ఉమ్మడి జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌డిగ్రీల్లో)

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
ములుగు	28	11
వరంగల్	28	12
హనుమకొండ	27	12
భూపాల్‌పల్లి	28	12
జనగాం	28	13
మహబూబాబాద్	28	13


వరంగల్‌సిటీ / ములుగు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చలి పంజా విసురుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొద్ది రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గత మూడునాలుగు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో జనం వణుకుతున్నారు. వృద్ధులు, పిల్లలు, శ్వాసకోశ సంబంధ సమస్యలు ఎదుర్కొం టున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల సెల్సియస్ నమోదవగా.. రాత్రిపూట 12 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. ఇక ఉదయమైతే 9గంటల వరకు పొగ మంచు కురుస్తోంది. పనులపై బ యటకొచ్చే వారు, విద్యార్థులు, రైతు లు స్వెట్టర్లు వేసుకుంటున్నారు. మ రీ ముఖ్యంగా ములుగు ఏజెన్సీ వా సులు వణికిపోతున్నారు. నాలుగురోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమో దవుతున్నాయి. పగటిపూట గరిష్ఠం గా 26డిగ్రీలతో వాతావరణం పొడి గా ఉంటున్నా అర్ధరాత్రికి ఆ ఉష్ణోగ్ర తలు క్రమంగా పడిపోతూ 11 నుంచి 13డిగ్రీలు నమోదవుతోంది. గోదావరి పరివాహకంలోని ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో గోదావరి నదీతీరం, అభయారణ్యం ప్రభావంతోనే చలి తీవ్రంగా ఉంటోంది.



కాళోజీ కళాక్షేత్రానికి మరమ్మతులు

- గేటుకు తాళంవేసి పనులు చేస్తున్న నిర్మాణ సంస్థ

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన





కాళోజీ కళాక్షేత్రానికి మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

హనుమకొండ టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరుతో నిర్మించిన 'కాళోజీ కళాక్షేత్రానికి పగుళ్లు' అనే వార్త ఈ నెల 11న ఆంధ్రజ్యోతి మెయిన్ ఎడిషన్‌లో వచ్చిన విషయం తెలిసిందే. కాగా, ఈవిషయంపై కుడా అధికారులు పగుళ్లు కాదు అని ఖండించారు. సోమవారం కాళోజీ కళాక్షేత్రం గేటుకు తాళం వేసి పగుళ్లు ఏర్పడిన గోడలపై కళాక్షేత్రం నిర్మాణ సం స్థ ప్రతినిధులు సిబ్బందితో పగుళ్లకు మరమ్మతు పనులు చేపట్టారు. నవంబరు 19న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా కాళోజీ కళాక్షేత్రాన్ని అట్టహాసంగా ప్రారంభించి నెల రోజులు గడవకముందే కళాక్షేత్రానికి పగుళ్లు రావడంపై స్థానిక ప్రజలు కాంట్రాక్టర్, కుడా అధికారుల తీరుపై పలు విమర్శలు గుప్పించారు. రూ. 95 కోట్ల నిధులతో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రజలు చూడ డానికి అనుమతించడంలేదని విమర్శించారు. కుడా అధికారులు, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడమే గోడలకు పగుళ్లు ఏర్పడడానికి ప్రధాన కారణమని అందుకోసమే కళాక్షేత్రంలోకి ప్రజలను అనుమతించడంలేదని వివిధ ప్రజా సంఘాల నాయకులు, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు కళాక్షేత్రం నిర్మాణం చేపట్టిన కుడా ఇంజనీరింగ్ అధికా రులు కాంట్రాక్టర్‌పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగులు

- పబ్జీ ద్వారా పరిచయమై డబ్బు కాజేసిన ఓ కేటుగాడు
- అప్పులపాలై తీవ్ర ఒత్తిడితో యువకుడి ఆత్మహత్య
- వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలో ఘటన

6

సత్వర పరిష్కారం చూపండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- బల్దియా ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు సత్వర పరిష్కారం చూపాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్‌హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలపై స్పందించని అధికారులు, సిబ్బందిని ఇకపై సహించేది లేదని విధుల్లో అలసత్వం వహి స్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బల్దియాలోని కొన్ని శాఖల నుంచి తరుచుగా ఫిర్యాదులు వస్తున్నాయని టౌన్ ప్లానింగ్ అధికారులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఇటీవల నిర్వహించిన సమగ్ర కులగణన సర్వేలో సిబ్బంది పని తీరు సంతృప్తినిచ్చిందని అన్నారు. గ్రేటర్ వ రంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను

మిగతా 6వ పేజీలో...

నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదు

- పనితీరు మార్చుకోకపోతే చర్యలు
- సిబ్బంది తీరుపై నివేదిక ఇవ్వాలని ఆర్ఎంవోకు ఆదేశం
- సీకేఎం ఆస్పత్రి సందర్శనలో కలెక్టర్ హెచ్చరిక



నూతనంగా ఏర్పాటుచేసిన కొత్త మానిటర్లను ప్రారంభిస్తున్న కలెక్టర్

గిర్మాజిపేట, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదని వరంగల్ కలెక్టర్ సత్యశారద సీకేఎం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను హెచ్చరించారు. సోమవారం ఆమె ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఇటీవల ఆస్పత్రిలో జన్మించిన శిశువును ఎంజీఎంకు తరలించగా మృతి చెందడం, ఆస్పత్రిలో సెప్టిక్ ట్యాంక్‌లు నిండి డ్రైనేజీ పైప్‌లు లీకైన సంఘటనలు పత్రికల్లో రావడంతో ఆమె ఆస్పత్రిని తనిఖీ చేశారు. మొదట నేరుగా ఓపీ బ్లాక్‌కు వెళ్లి మహిళలతో మాట్లాడారు. ఓపీ బ్లాక్‌లో బాలింతలకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం నవజాతశిశు వార్డు, మదర్ వార్డులకు వెళ్లి వైద్య సేవలపై ఆరా తీశారు. అత్యవసర వైద్య పరికరాలు, వెంటిలేటర్లు లేకపోవడంతో శిశువులను ఎంజీఎంకు పంపుతున్నామని ఆర్ఎంఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి వివరించారు. అనంతరం ఫార్మసీకి వెళ్లి మందుల కొరతలేకుండా చూసుకోవాలని సూచించారు. బెడ్‌షీట్లు శుభ్రంచేసేందుకు అవసరమైన డెటాయిల్, బ్లీచింగ్ పౌడర్, కెమికల్స్ లేవని సిబ్బంది చెప్పడంతో ఎవో సాజిద్ అలీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెయినేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశిం చారు. శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ, కాంట్రాక్టర్ పనితీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ పర్యటిస్తున్న సమయంలో ఎలుకలు, కుక్కలు ఆస్పత్రి ఆవరణలో సంచరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆస్పత్రిలో థర్డ్‌పార్టీ కాంట్రాక్ట్ కింద పనిచేస్తున్న 86 మంది సిబ్బంది పనితీరుపై నివేదిక ఇవ్వాలని ఆర్ఎంవోను ఆదేశించారు. ఆస్పత్రిలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ మిషన్‌ను వెంటనే ఏర్పాటుచేయాలన్నారు. ల్యాబ్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, 2వ ఆర్ఎంవో డాక్టర్ సత్యజిత్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు నూతనంగా ఏర్పాటుచేసిన 2 మానిటర్లను కలెక్టర్ సత్యశారద ప్రారంభించారు.

ముగిసిన గ్రూపు-2 పరీక్షలు

- హనుమకొండ జిల్లాలో 48.61 శాతం అభ్యర్థులు హాజరు
- వరంగల్ జిల్లాలో 45.69 శాతం అభ్యర్థులు హాజరు
- ఒక్క నిమిషం ఆలస్యంతో పరీక్షకు దూరమైన అభ్యర్థి



హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాయడానికి వెళుతున్న అభ్యర్థులు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూపు-2 పరీక్షలు సోమవారం ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా గ్రూపు-2 అభ్యర్థుల కోసం అధికారులు 82 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండవ రోజు 33006 మంది అభ్యర్థులకు గాను ఉదయం పరీక్షకు 16044 మంది అభ్యర్థులు హాజరవ్వగా 16962మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం పర్సంటేజీ 48.61 శాతం నమోదైంది. మధ్యాహ్నం పరీక్షకు 16026 మంది అభ్యర్థులు హాజరు కాగా 16980 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పర్సంటేజీ 48.55 శాతం నమోదైంది. హనుమకొండ భీమారంలోని ఎస్వీఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి ముల్కనూరుకు చెందిన ఉదయ్‌కిరణ్ ఒక్క నిమిషం ఆలస్యంగా రాగా అధికారులు పరీక్షకు రాయడానికి అనుమతించలేదు. దీంతో ఉదయ్‌కిరణ్ దిక్కుతోచని స్థితిలో ఇంటిబాట పట్టాడు. రెండు సంవత్సరాలు కష్టపడి గ్రూపు-2 పరీక్షకు సిద్ధం కాగా ఒక్క నిమషం ఆలస్యం కావడంతో పరీక్ష రాయలేకపోయాయని వాపోయాడు. గ్రూప్-2 పరీక్ష కోసం వరంగల్ జిల్లా వ్యాప్తంగా 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 11,310 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 5167 మంది హాజరు అయ్యారు. 45.69 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ ?

తోటి విద్యార్థితో అసభ్యకర ప్రవర్తన

దామెర, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాల సముద్రం) లోని విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసింది. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి, ఆరో తరగతి చదువుతున్న విద్యార్థితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఘర్షణ చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆదివారం రాత్రి ఆరో తరగతికి చెందిన విద్యార్థి చొక్కా, నిక్కరు గుండీలను తొమ్మిదో తరగతి విద్యార్థి విప్పమనడంతో ఘర్షణ జరిగినట్లు తెలిసింది. రాత్రి జరిగిన విషయాన్ని సదరు విద్యార్థి సోమవారం పాఠశాలలోని ఇంచార్జి ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురాగా, తొమ్మిదో తరగతి విద్యార్థిని ఇంచార్జి ప్రిన్సిపాల్ పిలిపించి మందలించి వదిలేసినట్లు తెలిసింది. అంతే కాకుండా పాఠశాలలో వివిధ తరగతుల్లోని కొందరు విద్యార్థులు బృందాలుగా ఏర్పడి రాత్రి సమయంలో తోటి విద్యా ర్థులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం.

రైలు ఢీకొని ఉద్యోగి మృతి



రమేష్ (ఫైల్)

సంగెం, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): సంగెం మండలం ఎల్గూరు రైల్వే స్టేషన్ లో రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతిచెం దాడు. అదే స్టేషన్‌లో పంచ్‌మెన్(జెండా ఊపే)గా పనిచేస్తున్న రాచ మల్ల రమేష్(46) సోమ వారం సాయంత్రం ఒకటో ప్లాట్ ఫాం నుంచి రెండో ప్లాట్‌ఫాంనకు వెళుతుండగా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామానికి చెందిన రమేష్ ప్రస్తుతం సంగెం మండలం గాంధీనగర్‌లో భార్య రజితతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతడి తండ్రి కొమురయ్య రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూనే మృతిచెందాడని, ఆయన సోదరుడు శ్రీనివాస్ సైతం యేడాది క్రితం మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మల్లన్న స్వామికి ఘనంగా దృష్టి కుంభం

- ధను సంక్రమణం సందర్భంగా నిర్వహణ
- ఆర్జిత సేవల అనంతరం స్వామివారి దర్శనం



దృష్టి కుంభం పూర్తయ్యాక అన్నం రాశిని దర్శించుకుంటున్న ఈవో నాగేశ్వర్‌రావు, ఎస్సై శ్రీనివాస్, అర్చకులు, భక్తులు

ఐనవోలు, డిసెంబరు 16(ఆంధ్ర జ్యోతి) : జాతర ఉత్సవాలకు ముందు ఐనవోలు మల్లికార్జునస్వామికి నిర్వహించే దృష్టి కుంభాన్ని సోమవారం వేద పారాయాణల మధ్య ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఆరు రోజుల పాటు సాగిన సుధావలి వర్ణలేపనం కార్యక్రమం ఆదివారం రాత్రి పూర్తయింది. దృష్టి దోషాలు జరుగకుండా చేసే ఈ కార్యక్రమంలో స్వామి, అమ్మవార్లకు రంగులు అద్ది నేత్రోన్మీలన (నేత్రాలకు మైనం)పెట్టారు. సూర్యోదయానికి ముందు కుంభహారతితో మూడు సార్లు ఆలయం చుట్టూ ప్రదక్షణ చేస్తూ గుమ్మడికాయలు, నిమ్మకాయలను కత్తితో కొడుతూ వేద మంత్రాలు పఠించారు. గర్భగుడికి ఎదురుగా అర్ధ మండపంలో మూడు క్వింటాళ్ల అన్నాన్ని రాశి(కుంభం)గా పోసి కుంకుమ హారతులను వెలిగించారు. అన్నం రాశికి ఎదురుగా దర్పణం(అద్దం) రాశికి అవతల తూర్పు వైపు మేకపిల్లను నిలిపారు. స్వామి అమ్మవార్ల దృష్టి నేరుగా అన్నం రాశి, మేకపిల్లపై పడేవిధంగా నేత్రాలకు పెట్టిన మైనాన్ని వెనుకాల నుంచి తొలగించి సుర్యోదయానికి ముందు దృష్టికుంభం తంతును పూర్తిచేశారు. గణపతి పూజ, పుణ్యహావాచనం చేసి సంప్రోక్షణ జరిపారు. పంచామృతాలతో ఏకదశ రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం,(అభిషేకం) తీర్థప్రసాద వినియోగము జరిపారు. దీంతో ఆరు రోజుల పాటు నిలిచిన ఆర్జిత సేవలు యథావిధిగా ప్రారంభమయ్యాయి. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. దృష్టికుంభాన్ని నెల రోజుల ముందు ధను సంక్రమణ రోజున నిర్వహించారు. దృష్టికుంభం పూర్తవడంతో అర్చకులు ఉద్యోగులు మండపంలో సంతోషంగా నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు దంపతులు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తం శర్మ, విక్రాంత్‌జోషి, అర్చకులు నందనం మధుశర్మ, భానుప్రసాద్, నరేష్‌శర్మ, ఉప్పుల శ్రీనివాస్, మడికొండ దేవేందర్, పోశయ్య, ఎస్సై పస్తం శ్రీనివాస్, ఉద్యోగులు అద్దంకి కిరణ్, ఆర్.సంజీవరావు, జి.ప్రేమ్‌కుమార్, సిబ్బంది శ్రీకాంత్, కన్నయ్య, అభిషేక్, రాజులు, మాజీ ఎంపటీసీ బొల్లేపల్లి మధు, ఒగ్గు పూజారులు, భక్తులు పాల్గొని దర్శించుకున్నారు.

చెన్నారావుపేట ఎంపీవో సస్పెన్షన్

చెన్నార్రావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజు సస్పెన్షన్‌కు గురయ్యారు, ఇటీవల ఎంపీడీవో పట్ల ప్రవర్తించిన తీరు, అసభ్యకరంగా మాట్లాడటం, పంచాయతీ కార్యదర్శులను ఇబ్బందులు పెట్టిన విషయంలో వచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో వాస్తవమేనని తెలడంతో జిల్లా కలెక్టర్ సత్యశ్యారద సస్పెషన్‌ను విధించారు. సోమవారం ఈ మేరకు ఎంపీవోను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీవాణి తెలిపారు.

ప్రముఖ ఒగ్గు కళాకారుడు మృతి



ఒగ్గు కళాకారుడు ఐలయ్య (ఫైల్)

బచ్చన్నపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కట్కూరుకు చెందిన ప్రముఖ ఒగ్గు కళాకారుడు చెట్టె ఐలయ్య (75) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. నాలుగు దశాబ్దాలుగా ఒగ్గు కథలను అవలీలగా చెబుతూ ప్రాచుర్యం పొందాడు. హైదరాబాద్‌లో జరిగిన అనేక ఉత్సవాలు, పండుగల్లో ఒగ్గు కథలు చెప్పి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. పాత్రలను గానంతో రక్తికట్టించేవారు. ఐలయ్య మృతికి చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత వెంకటాచారి, మాజీ ఎంపీపీ బావండ్ల కృష్ణంరాజు, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు పుట్ట నర్సింహులు, నేతలు ముసిని రాజుగౌడ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు ముసిని శ్రీశైలంగౌడ్ పలువురు ఒగ్గు కళాకారులు, గ్రామ ప్రజలు సంతాపం తెలిపారు. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.



వస్త్రాలను తిలకిస్తున్న వినియోగదారులు

హరిత కాకతీయ హోటల్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్ పో

బాలసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆదివారం నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభమైంది. ఈ ప్రదర్శన ఈనెల 19 వర కు కొనసాగుందని నిర్వాహకుడు నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాలోని నిష్ణాతులైన చేనేత కళాకారులు ఉత్పత్తి చేసిన కాటన్, సిల్క్, డిజైనర్ వేర్, ఫ్యాషన్ జూవెలరీ, ఎత్నిక్‌వేర్, కుర్తి, హోం లినెన్, మరెన్నో ఈ ప్రదర్శనలో ఉన్నాయని చెప్పారు. ఈ నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రధానంగా వివాహ, సంక్రాంతికి ప్రత్యేకమన్నారు. ప్రతీ రోజు ప్రదర్శన ఉదయం 11గంటలనుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కొనుగోళ్లపై 50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

19న హనుమకొండకు ఏకసభ్య కమిషన్ రాక

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టీస్ షమీమ్ అక్తర్ ఈ నెల 19వ తేదీన హనుమకొండకు రానున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ సత్యశారదా దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై అధ్యయనం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో బహిరంగ విచారణ నిమిత్తం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బహిరంగ విచారణ కార్యక్రమం ఉంటుందన్నారు. నాయకులు అధిక సంఖ్యలో బహిరంగ విచారణకు హాజరై తమ వినతులు ఇవ్వాలని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు ఫుడ్ సేఫ్టీ అధికారుల రాక..

ఐదుగురు అధికారులు, 12 మంది ఉద్యోగుల కేటాయింపు

బాలసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అరకొర అధికారులు, సిబ్బంది కొరతతో ఇన్నాళ్లుగా అసలు ఇక్కడ ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనేది ఉందా..? ఉంటే తినుబండారాలపై తనిఖీలు చేసిన దాఖలాలు ఎక్కడా..? అనే ప్రశ్నలు తరచూ ప్రజల్లో రేకెత్తేవి. కొద్ది నెలల క్రితం వరంగల్ మహా నగరంలో ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన హైదరాబాద్ నుంచి వచ్చిన టాస్క్‌ఫోర్స్ అధికారులు పలు హోటళ్లపై జరిపిన దాడుల్లో విస్మయం కలిగించే విధంగా కుళ్లిన మాంసం, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, నిషేధిత రంగులు కలపడం లాంటి ప్రజలు తినకూడని, ఆరోగ్యానికి హాని కలిగించే అంశాలు ఎన్నో వెలుగు చూశాయి. ఆహార కల్తీ, నాసిరకం పదార్థాల వినియోగం, విషపూరిత రంగుల నియంత్రణ పర్యవేక్షణ ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు రాష్ట్రంలో నూతనంగా 24మంది ఫుడ్ సేఫ్టీ అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వగా అందులో ఐదుగురు అధికారులను ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించింది. ఇద్దరిని వరంగల్ జిల్లాకు, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాలకు ఒక్కొక్కరి చొప్పున పోస్టింగ్ ఇచ్చారు. అంతేగాక ఒక్కొక్క జిల్లాకు ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, ఒక శాంపిల్ కలెక్షన్ ఉద్యోగి చొప్పున 12 మంది ఉద్యోగులను పోస్టింగ్ ఇచ్చారు. నియామకం అయిన అధికారులు, ఉద్యోగులు రేపో మాపో విధుల్లో చేరనున్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



భీమరాజు (ఫైల్)

గిర్మాజిపేట, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జీఆర్పీ సీఐ పి.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు ప్రాంతానికి చెందిన వల్లెపు బీమ రాజు(33) ఓ కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి కొత్తవాడలో అద్దెకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి జరిగిన కుటుంబ గొడవల్లో భార్య, ఇద్దరు కూతుర్లను కొట్టి ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. సోమవారం తెల్లవారుజామున తను వరంగల్-కాజీపేట రైల్వేస్టేషన్‌ల మధ్య శాయంపేట సమీపంలో రైలు కిందపడి చనిపోయాడు. ఎంజీఎంలో పోస్టుమార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని తండ్రి ఐలయ్యకు అప్పగించారు. హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాయుధ పోరాట యోధుడు.. దర్యానాయక్ కన్నుమూత

107పళ్ల వయస్సులో అనారోగ్యంతో మృతి

- జనగామ జిల్లాలో విషాదం.. నేడు అంత్యక్రియలు
- హాజరుకానున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని
- నాడు విస్నూర్ దొర ఆగడాలకు ఎదురొడ్డిన దర్యానాయక్



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు ధర్యానాయక్ (ఫైల్)



దర్యానాయక్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రమేష్

దేవరుప్పుల, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): దేశ్‌ముఖ్ ఆగడాలకు ఎదురొడ్డి పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోతు దర్యానాయక్ (107) సోమవారం సాయంత్రం కన్నుమూశారు. జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల మండలం ధర్మాపురంలోని జాటోతుతండాకు చెందిన నాయక్ రెండేళ్లగా అనారోగ్యం (వృద్ధాప్యం)తో బాధపడుతున్నాడు. దర్యానాయక్ భార్య గతంలోనే చనిపోగా, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు చంద్రభాను నాయక్, చిన్నకుమారుడు పర్శునా యక్ ఉన్నారు. స్థానికంగానే ఉంటూ వ్యవసాయం చేసు కుంటూ జీవిస్తున్నారు. కాగా కుమార్తె తారాబాయి ఉన్నా రు. ప్రస్తుతం గ్రామం లో ఉంటున్న దర్యా నాయక్ ఆలనాపాలన కూతురు తారాబాయి చూసుకుంటోంది. ఇక దర్యానాయక్ అంత్యక్రియలు మంగ ళవారం జాటోతు తండాలో జరగ నున్నాయి. అంత్యక్రియలకు సీని యర్ పాత్రికేయులు పాశం యాద గిరి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మి నేని వీరభద్రం, మాజీ మంత్రి ఎర్ర బెల్లి దయాకర్‌రావు, సీపీఐ జిల్లా కా ర్యదర్శి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆదిసాయన్న, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా తిరు పతిరెడ్డి హాజరు కానున్నారు.

తుపాకీ చేతబట్టి.. దేశ్‌ముఖ్‌ను ఎదిరించి..

దేశ్‌ముఖ్ రాపాక రాంచెంద్రారెడ్డి మితిమీరి పోయిన అరాచకాలను దర్యానాయక్ ఎదురొడ్డి తిప్పికొట్టాడు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తుపాకీ చేతబట్టి అలుపెరగని పోరాటం చేశారు. మహిళల మాన, ప్రాణాలను కాపాడటం కోసం కడవెండికి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు నల్లా నర్సింహులు గ్రామ రక్షణ దళాలు ఏర్పాటు చేయగా అందులో సభ్యుడిగా చేశారు. దేశ్‌ముఖ్ గుండాలను తరమికొడుతూ వారికి సింహస్వప్నంలా మారాడు. గ్రామంలోని దేశ్‌ముఖ్ గుండాల దాడిలో పదిమంది సజీవ దహనం చేశారు. దర్యానా యక్ అన్న రానూనాయక్ మొండ్రాయి గ్రామంలో ఎద్దులబండి చక్రాలకు కట్టేసి చిత్రహింసలు పెట్టి చంపారు. సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు జీడి ఎల్లయ్య, బిల్లా తిరుపతిరెడ్డి, సింగారపు రమేష్, పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, తీగల దయాకర్, బస్వ మల్లేశం, చింత రవి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

సత్వర పరిష్కారం చూపండి

(5వ పేజీ తరువాయి)

పరిష్కరించేందుకు ప్రతీ వారం నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరై సమస్యలు చెప్పుకున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 63 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, సెక్రెటరీ అలివేలుతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

- గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ వంగపహాడ్ శ్మశానవాటికలో తాగడానికి మంచి నీరు లేదని, దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఎనుమాముల రోడ్డు నెంబర్ -4 సాయిగణేశ్ కాలనీలో సీసీ రోడ్డు, డ్రైయినేజీలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్‌గొర్రెకుంటలో రోడ్డు మరమ్మతు పనులు చేస్తుండగా మిషన్ భగీరథ పైపులైను పగిలిపో యింది. చాలా రోజులుగా రోడ్డుపైనే నీరు ప్రవహిస్తూ అటుగా ప్రయాణించే ప్రజలకు ఇబ్బందిగా మారుతుందని గరీబ్ నగర్ వాసులు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ 53వ డివిజన్ సమ్మయ్యనగర్‌లో కొందరు రోడ్లను ఆక్రమించి ప్రహరీ నిర్మించడంతో పాటు ప్రధాన రోడ్డును ఆక్రమించి కట్టడాలు జరుపుతున్నా కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండలోని 50వ డివిజన్ న్యూబస్టాండ్ సమీపంలోని విద్యుత్‌నగర్‌లో చాలా కాలంగా కుక్కల సమస్య ఉందని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. కొత్తబస్ స్టేషన్ ప్రాంతంలో మహిళలు, పిల్లలు బయటకు వెళ్లాలంటే బయపడిపోతున్నారని తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2500	2080
పల్లికాయ (సూక)	3500	3000
పల్లికాయ (పచ్చిది)	5250	4500
కందులు	-	-
పెసళ్లు	-	-
పత్తి	7010	5800
పసుపు (కాడి)	-	-
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి కొత్తది	15516	12000
తేజ ఏసీ	16000	14000
వండర్‌హాట్ ఏసీ	-	-
యూఎస్ 341ఏసీ	13500	11000
యూఎస్ 341కొత్తది	13000	12500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగులు





మృతిచెందిన మరుపట్ల హనూక్

వర్ధన్నపేట రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బెట్టింగ్.. ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. పబ్జీ గేమ్ ద్వారా పరిచయమైన ఓ యువకుడు.. ఆన్‌లైన్ బెట్టింగుల జూదంలోకి దించాడు. అతడి మాటలు నమ్మి ఓ యాప్ ద్వారా రూ.లక్షల్లో బెట్టింగ్ పెట్టిన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలానికి చెందిన ఓ యువకుడు అప్పులపాలై మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం తెల్లవారు జామున జరిగిన ఈ ఘటన ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిల్చింది. బాధిత కుటుంబం, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేట మండలం బండౌతపురం గ్రామానికి చెందిన మరుపట్ల సోమయ్య-యాకమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు ఆశీర్వాదం కరోనా సమయంలో మృతిచెందగా.. చిన్న కుమారుడు మరు పట్ల హనూక్ (26)గ్రామంలోని ఓ పెట్రోల్ పంపులో పనిచేస్తున్నాడు. కూలీ నాలీ చేసుకుని జీవించే ఆ కుటుంబంలో ఆన్‌లైన్ బెట్టింగ్ తీరని విషాదాన్ని నింపింది. పెద్దకుమారుడు చనిపోయిన బాధ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆ తల్లిదండ్రులకు గుండెకోత మిగిల్చింది. కొన్ని నెలలుగా హనూక్ ఆన్‌లైన్‌లోని ఓ యాప్‌లో బెట్టింగ్ పెట్టడం ప్రారంభించాడు. పెట్టిన డబ్బుకు రెట్టింపు వస్తుండటంతో మరింత ఆశతో రూ.లక్షల్లో బెట్టిం గులు పెట్టడం ప్రారంభించాడు. ఇలా సుమారు రూ.6లక్షల వరకు అప్పులు కావడంతో వాటిని తీర్చలేక తీవ్ర ఒత్తిడికి గురైన హనూక్ సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. దీంతో మూడేళ్ల వ్యవధిలో ఇద్దరు కుమారులను కోల్పోయిన ఆ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

పబ్జీ ద్వారా పరిచయమై...

ఏపీలోని వైజాగ్‌కు చెందిన ఓ యువకుడికి మరుపట్ల హనూక్ పబ్జీ గేమ్ ద్వారా పరిచయమైనట్లుగా మృతుని స్నేహితులు చెపుతున్నారు. హనూక్ ఖాళీ సమయాల్లో పబ్జీ గేమ్ ఆడుతుండే వాడని, అందులో పరిచయమైన ఓ వ్యక్తితో గేమ్ ఆడేవాడని, అలా పరిచయమైన ఆ వ్యక్తితో చాలా సన్నిహితంగా మాట్లాడేవాడని చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఏపీకి చెందిన ఆ వ్యక్తి హనూక్‌ను ఆన్‌లైన్ బెట్టింగ్ వైపు మళ్లించాడని, డబ్బులు చాలా సంపాదించ వచ్చని చెప్పడంతో ఆశపడిన హనూక్ డబ్బులు పెట్టడం ప్రారంభించాడని, ఇలా యాప్‌లోనే కాకుండా వైజాగ్‌కు చెందిన వ్యక్తికి కూడా ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపి బెట్టింగులు పెట్టించేవాడని చెబుతున్నారు. ఇలా డబ్బులు ఎక్కువ మొత్తంలో తీసుకున్న ఏపీకి చెందిన వ్యక్తి చివరకు హనూక్‌కు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం ప్రారంభించాడని, దీంతో ఓసారి హనూక్ వైజాగ్ వెళ్లి తన డబ్బులు తనకు ఇవ్వాలని గొడవ పెట్టుకోవడంతో కొంత నగదు ఇచ్చినట్లు తెలుస్తోంది. వీరిద్దరి మధ్య లావాదేవీలతో పాటు ఇతర కారణాలు కూడా ఆత్మహత్యకు కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఆదివారం కూడా హనూక్ ఆన్‌లైన్ ద్వారా వైజాగ్ వ్యక్తికి రూ.90 వేలు పంపినట్టు అతడి స్నేహితులు చెబుతున్నారు. అయితే హనూక్ ఆత్మహత్య విషయం తమ దృష్టికి వచ్చిందని, ఎలాంటి రాతపూర్వక ఫిర్యాదు అందలేని వర్ధన్నపేట పోలీసులు చెబుతున్నారు.

వైద్య శిబిరాలను

వినియోగించుకోవాలి

కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మీసురేందర్



రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

మట్టెవాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మీసురేందర్ అన్నారు. సోమవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 11వ డివిజన్ రాజీవ్ కాలనీలోని కమ్యూనిటీ హాలులో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ వారి ఆధ్వర్యంలో బీపీ, షుగర్, రక్త పరీక్షలు, కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ నిర్మల, ప్రెసిడెంట్ కోటిలింగం, సెక్రటరీ డాక్టర్ కె.సుభాష్, డాక్టర్ వరుణ్, ఎస్.అశోక్, డివిజన్ అధ్యక్షుడు గన్నారపు సంగీత, నాయకులు సమద్, గద్దల శివ, బి.పవన్, ఆర్.మహేష్, క్రాంతి, జి.రాజు, శ్యాంసుందర్, సతీష్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

ప్రదీప్‌రావు పరామర్శ

శంభునిపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రంగశాయిపేటకు చెందిన ముత్తినేని రామ్మూర్తి భార్య అండన్‌వాడీ రిటైర్డ్ టీచర్ సునితాదేవి ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సునీతాదేవి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట కర్నె రవీందర్, కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, చందా మనసోహర్ ఉన్నారు.

రేపు పరీక్షలపై అవగాహన



మాట్లాడుతున్న వడుప్సా వరంగల్ డివిజన్ అధ్యక్షుడు బొల్లం కనకయ్య

పోచమ్మమైదాన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పదో తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వడుప్సా వరంగల్ డివిజన్ అధ్యక్షుడు బొల్లం కనకయ్య తెలిపారు. సోమవారం ఆయన పోచమ్మమైదాన్‌లో మాట్లాడుతూ.. ఉర్సుగుట్ట సమీపంలోని నాని గార్డెన్స్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వడుప్సా కార్యదర్శి జన్ను విలియమ్స్, కోశాధికారి బాలవారి సుధీర్, ప్రతినిధులు సుధాకర్, యాద నసీరుద్దీన్, ఎమ్డీ ఉస్మాన్‌అలీ, రేపల్లి అశోక్‌కుమార్, రంగు మాధవి, ఎమ్డీ ఖలీల్, మినుపురి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాసుల కోసం కక్కుర్తి!

- పెట్రోల్ బంకుల్లో మెట్రాలజీ అధికారుల చేతివాటం
- కొత్త పావులను వాడటంలో నిర్లక్ష్యం
- పాత పరికరంతోనే తనిఖీలు
- ఎనిమిదేళ్లుగా ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు

మట్టెవాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో జరిగే మోసాలను అరికట్టాల్సిన లీగల్ మెట్రాలజీ అధికారులు కాసుల కోసం కక్కుర్తిపడి చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. పెట్రోల్‌ను కొలిచేందుకు ప్రభుత్వం అందించిన పరికరాన్ని కాకుండా పాతకాలం నాటి పావులనే వాడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా వినియోగదారులు మోసపోతున్నారు. వాస్తవానికి భారత ప్రభుత్వం పెట్రోల్‌ను కొలిచేందుకు తూనికల కొలతల శాఖకు 2016లో 10 లీటర్ల టెస్ట్ చెక్ మెజర్ పరికరాన్ని అందించింది. పెట్రోల్ కొలతల్లో మోసం జరుగకుండా ఉండేందుకు స్టీల్‌తో తయారు చేసిన రీడింగ్ కనప డుతున్న, మోసం చేయడానికి అవకాశం లేని పరికరాన్ని అందిం చింది. దాని విలువ రూ.40 వేలు ఉంటుంది. ఈ పరికరాన్నే వాడాలని ఆదేశాలిచ్చింది. అయినప్పటికీ అధికారులు పాతకాలం నాటి 5 లీటర్ల పావుతోనే కొలుస్తున్నారు. వరంగల్ లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ 10 లీటర్ల చెక్ మెజర్ వినియోగించేందుకు సర్టిఫికేషన్ ఇవ్వడం లేదని, అందువల్లే 5 లీటర్ల పావును వాడుతున్నామని మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్లు చెబుతున్నారు.

అధికారులు నూతన పరికరాన్ని వాడితే ఖచ్చితమైన పెట్రోల్ వస్తుంది. కాని సంబంధిత అధికారుల జేబుల్లోకి వచ్చే ఆదాయం తగ్గుతుందని, అందుకే డిప్యూటీ కంట్రోలర్ సర్టిఫికేషన్ ఇవ్వడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఆ పరికరం వచ్చి 8 ఏళ్ళు గడుస్తున్నటికీ సర్టిఫికేషన్ ఇవ్వకపోవడానికి కారణమేంటని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ పరికరాన్ని బంకుల్లో మూలకుపడేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇప్పటికైనా లీగల్ మెట్రాలజీ రాష్ట్రస్థాయి అధికారులు స్పందించి 10 లీటర్ల చెక్‌మెజర్‌ను వినియోగంలోకి తీసుకుచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

పది లీటర్ల పరికరాలు అనుకూలంగా లేవు..

రాజేశ్వర్, అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ

పెట్రోల్‌లో నాణ్యత, పరిమాణం చెస్ చేసేందుకు 5 లీటర్ల బ్రాస్‌టెస్ట్ మెజర్‌లనే వినియోగిస్తున్నాం. 10 లీటర్ల స్టీల్ టెస్ట్ మెజర్ లను ప్రభుత్వం అందించింది వాస్తవమే. కాని వాటిని వినియోగిం చడానికి అనుకూలంగా లేవు. 5లీటర్ల బ్రాస్ టెస్ట్ మెజర్‌లో ఎలాంటి లోపాలు లేవు. అందుకే వాటినే వాడుతున్నాం.



పది లీటర్ల కొలమాన పరికరం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐసీటీయూ, ఎంసీపీఐ(యూ) నాయకులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ, సీపీఐ(ఎంఎల్) నాయకులు

దేశ సంపద పెట్టుబడిదారుల పాలు

- అప్పనంగా దోచిపెడుతున్న ప్రధాని మోదీ
- ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 16: (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ దేశ సంపదను అదానీ, అంబానీ లాంటి బడా పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ ఆరోపించారు. సోమవారం ఆల్ ఇండియా సెంటర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (ఏఐసీటీయూ), భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏకశిలా పార్కు నుంచి ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేశ్, నర్ర ప్రతాప్ మాట్లాడుతూ దోపిడీ విధానాలను నిరసిస్తూ కార్మిక హక్కుల సాధన కోసం సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ సంధ్యారాణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నుంచు జగదీశ్వర్, అధ్యక్షుడు మహ్మద్ మాసుక్, ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకులు మంద రవి, బాబురావు, ఇస్మాయిల్, నగేశ్, నర్సయ్య, నవి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ పైడిపల్లి శివారు ఎస్సారెస్పీ భూముల్లో మూడు సంవత్సరాల క్రితం పేదలకోసం గుడిసెలు వేయించామని, ఇటీవల పోలీసులు ఎలాంటి సమాచారం లేకుండానే రాత్రికి రాత్రే వాటిని తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే స్థలంలో పేదలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఐ, సీపీఐ(ఎంఎల్) నాయకులు బాషుమియా, బుస్స రవీందర్, జన్ను రవి, రమేశ్, సుధీర్, మల్లన్న, శంకర్, హరిబాబు, కుమార్, ప్రసంగి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

అర్హులైన కళాకారులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రజానాట్యమండలి జిల్లా గౌరవ అధ్యక్షుడు గన్నారపు రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర విజయ్ కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్న యాదగిరి, శాంతి, సుమలత, శ్రీలత, సాంబయ్య, మహేశ్ పాల్గొన్నారు.

న్యాయవాది మృతిపట్ల సంతాపం

వరంగల్ లీగల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది బొడ్డు కరుణాకర్ మృతి పట్ల హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ల ప్రతినిధులు సోమవారం నివాళులర్పించారు. శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన కరుణాకర్‌కు సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ హాల్‌లో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ కరుణాకర్ మృతి న్యాయవాద వృత్తికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శులు ముదసిర్ అహ్మద్, లాదె రమేష్, బార్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ సిరికొండ సంజీవరావు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. అంతకు ముందు వరంగల్ జిల్లా జడ్జి నిర్మలగీతాంబ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు హాల్‌లో సంతాపం ప్రకటించారు.

నిందితులపై చర్య తీసుకోవాలి

శ్రీగోవిందరాజస్వామి ఆలయ పూజారి శ్రీనివాసస్వామి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసస్వామి, అర్చకులు

గిర్మాజిపేట, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ శ్రీగోవిందరాజస్వామి ఆలయం తాళాలు పగలగొట్టిన సంఘటనలో నిందితులపై చర్యలు తీసుకోవాలని ప్రధాన పూజారి వరయోగుల శ్రీనివాస స్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన దేవాలయంలో మాట్లాడుతూ అనారోగ్యం కారణంగా కొన్ని రోజులుగా సెలవు తీసుకున్న అనంతరం తాను ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ఆదివారం తిరిగి విధుల్లో చేరానని అన్నారు. అయితే ఆలయ అర్చకులు జగన్నాథం కిరణ్ స్వామి, రాము స్వాములు ఆదివారం రాత్రి గుట్టపై ఉన్న ప్రధాన ఆలయం, గుట్ట కింద ఉన్న ఉత్సవమూర్తుల ఆలయం తాళాలు పగలగొట్టారని ఆరోపించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి విచారణ చేశారని, కిరణ్ స్వామి, రాము స్వామిలే తాళాలు పగులగొట్టారని నిర్ధారణ చేశారని, అయితే వీరిపై చర్యలు తీసుకోకుండా స్థానిక కార్పొరేటర్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో అర్చకులు మురళీకృష్ణస్వామి, అరుణ్‌స్వామి, లక్ష్మణస్వామి, ప్రసాద్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల బుధవారం వరంగల్ జిల్లా ఉపాధి కార్యాలయంలో ప్రైవేట్ సెక్టార్‌లో ట్రైనింగ్, ప్లేస్‌మెంట్‌కు జాబ్‌మేళా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి సిహెచ్.ఉమారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ, బీటెక్, ఫార్మ, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ చేసి 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు గల ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 18వ తేదీన ఉదయం ములుగురోడ్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 7093168464 సెల్ నెంబరులో సంప్రదించాలని సూచించారు.



భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ

హాజరైన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

కాశిబుగ్గ, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి) : అజంజాహి కార్మిక భవన స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు సోమవారం భూమి పూజ చేశారు. వెంకట్రామ టాకీస్ సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి హాజరయ్యారు. కొంత కాలంగా ఈ స్థలంపై వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పూజ చేయడాన్ని కార్మికులు జీర్ణించుకోలేకపోతున్నారు. కొండా మురళి కొబ్బరికాయ కొట్టి వెళ్లాక పాత భవనాన్ని నేలమట్టం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వస్త్ర వ్యాపారి కాసం నమఃశివాయ, గట్టు మహేష్ బాబు, కాంగ్రెస్ నేతలు గోపాల నవీన్ రాజ్, ఓని బాస్కర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరికరాలతో అనేక ప్రయోజనాలు

- మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల
- 'మన అగ్రిటెక్' వద్ద డ్రోన్ ప్రదర్శన



డ్రోన్ ప్రదర్శనను పరిశీలిస్తున్న పోలెపాక నిర్మల

వరంగల్ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునిక పరికరాలు వినియోగిస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయని, ముఖ్యంగా కూలీల కొరత, పెట్టుబడి ఖర్చు తగ్గుతాయని ఏనుమాముల మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల అన్నారు. సోమవారం మార్కెట్లో డ్రోన్ వినియోగంపై ప్రదర్శన ఇచ్చారు. ముఖ్య అతిథిగా నిర్మల హాజరై మాట్లాడారు. ఎకరా భూమిలో డ్రోన్ 15 నిమిషాలలో పురుగుమందును పిచికారీ చేస్తుందని, దీంతో సమయం, డబ్బులు ఆదా అవుతాయని అన్నారు. ఏనుమాముల మార్కెట్‌లో ఉన్న మన అగ్రిటెక్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ఆధునిక వ్యవసాయ యంత్రపరికరాలను అందించడం అభినందనీయమన్నారు. ఆధునిక పరికరాలతో నిరుద్యోగులు ఉపాధి పొందవచ్చని, డ్రోన్‌పై పెట్టిన పెట్టుబడి ఆరు నెలల్లో తిరిగి వస్తుందని అన్నారు. ఆసక్తి ఉన్న వారు మన అగ్రిటెక్‌ను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, అగ్రిటెక్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్

పోచమ్మమైదాన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో జరిగిన తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలలో ఆరెపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎస్‌కే.గులహన్, మొండ్రాయి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి బి.లక్ష్మీప్రసన్న ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపియ్యారు. ఈ సందర్భంగా విజేతలను సోమవారం ఆరెపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్ శాలువాలు కప్పి అభినందించారు. అనంతరం డీఎస్ఆర్ ట్రస్టు దేవగిరి పట్నం సహకారంతో టీ షర్టులు, షూ పంపిణీ చేశారు. అనంతరం వరంగల్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూజారి అశోక్‌బాబు మాట్లాడుతూ వీరు ఈ నెల 20వ తేదీ నుంచి జమ్ము-కాశ్మీర్‌లో జరుగనున్న 37వ సబ్ జూనియర్స్ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు జన్ను అనిల్‌కుమార్, బుద్దె పెద్దన్న, పాఠశాల ప్రిన్సిపాల్ టి.వెంకన్న, ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారుల బృందం

కాశిబుగ్గ, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): జిల్లా జూనియర్స్ కబడ్డీ ఎంపిక పోటీలు సోమవారం ఓ సిటీ మైదానంలో నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22వ తేదీ నుంచి 25వరకు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాఖాన్, సహాయ కార్యదర్శి మల్లికార్జున్ తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సత్యవాణి, అక్తర్, హసన్, నారాయణ, ఏలియా, రవీందర్, శ్రీకాంత్, రవికుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఒకేషనల్ విద్యార్థులు గత మూడు సంవత్సరాలల్లో పారా మెడికల్ కోర్సులు (ఎంఎల్‌టీ), (ఎంపీహెచ్‌డబ్ల్యూ- స్త్రీలు) పూర్తి చేసుకున్న విద్యార్థులు అప్రెంటీస్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎ.గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని మిషన్ హాస్పిటల్, పీహెచ్‌సీ పరకాలలో మాత్రమే దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంజీఎం, సీకేఎం హాస్పిటల్‌లో దరఖాస్తు చేసుకునే వారు వరంగల్ జిల్లా నోడల్ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

శంభునిపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఉర్సు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఫ్యూజన్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా స్కూల్ బ్యాగులు అందించారు. హెచ్‌ఎం పూసారాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ డివిజనల్ మేనేజర్ అలిమాలి వినయ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, చక్రపాణి, కోమలత, హైమావతి, ఫ్యూజన్ సంస్థ మేనేజర్‌లు సంతోష్‌బాబు, కవిరెడ్డి పాల్గొన్నారు.

కార్మిక భవన పరిరక్షణకు ఉద్యమిస్తాం

బీజేపీ రాష్ట్ర నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

మిల్స్‌కాలనీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్మిక భవనాన్ని కూల్చి కమర్షియల్ కాంప్లెక్స్ కట్టడం దారుణమని, కార్మిక భవన పరిరక్షణ కోసం కార్మికులను కలుపుకొని ఉద్యమిస్తామని బీజేపీ రాష్ట్ర నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ప్రకటించారు. అజంజాహి కార్మిక భవన స్థలం కబ్జాకు గురి కావడాన్ని ఆయన ఖండించారు.

అజంజాహి కార్మిక భవన ప్రాంగణంలో సోమవారం వాణిజ్య భవన సముదాయానికి భూమి పూజ నిర్వహించారు. ప్రముఖ బట్టల వ్యాపారవేత్త ఆధ్వర్యంలో నిర్వహించిన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరుకావడాన్ని ప్రదీప్‌రావు తప్పుపట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కార్మికుల భవనం కబ్జాకు గురికావడం, అప్పుడు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు వారికి అండగా ఉంటానని చెప్పి ఇప్పుడు కబ్జాలకు పాల్పడ్డ వ్యక్తుల కోసం భవన నిర్మాణ భూమి పూజకు రావడం ఎంత వరకు సమంజసమని ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ప్రశ్నించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రవీందర్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాక్టో అభ్యర్థి పూల రవీందర్ గెలుపు ఖాయమని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. సోమవారం పూల రవీందర్‌తో కలిసి విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూల రవీందర్ ఉపాధ్యాయ పక్షపాతి, సమస్యలపై స్పష్టమైన అవగాహన కలిగిన వ్యక్తి అన్నారు. ఎమ్మెల్సీగా చేసిన కాలంలో ఎన్నో డిమాండ్ల పరిష్కారం చేసిన నిజమైన నాయకుడని, ఉపాధ్యాయుల మద్దతుతో మరోసారి ఎమ్మెల్సీ కావడం ఖాయమన్నారు. పూల రవీందర్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దుకే మొదటి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య, హనుమకొండ జిల్లాప్రధాన కార్యదర్శి వి.రాంబాబు, రాధాకృష్ణ, బాబురావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వశిక్షా ఉద్యోగులకు ఉపాధ్యాయుల మద్దతు



నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న టీచర్లు

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సర్వశిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, కేజీబీవీ సిబ్బంది చేపట్టిన దీక్షలకు సంఘీభావంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో యూపీఎస్ వసంతాపూర్‌లో ఉపాధ్యాయులు సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడారి భోగేశ్వర్ మాట్లాడుతూ విద్యారంగంలో వెట్టిచాకిరి విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకాలన్నారు. సర్వ శిక్ష ఉద్యోగులు, కేజీబీవీ సిబ్బందిని రెగ్యులర్ ఉద్యోగులుగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జే.సుభాష్, ఏ.మోహన్‌రావు, పి.ఇందిర, వి.రమాదేవి, పి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సంక్షేమ అధికారుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీఎన్‌జీవోస్ నాయకులు

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 16: (ఆంధ్రజ్యోతి): వసతి గృహ సంక్షేమ అధికారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ సత్యశారదకు సోమవారం టీఎన్‌జీవోస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జి.రామ్‌కిషన్ మాట్లాడుతూ సంక్షేమ వసతిగృహాల్లో సరిపడా సిబ్బంది లేరని, కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలంటే అనుభవం ఉన్న సిబ్బందిని నియమించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ నాయకులు వీరన్న, గాజె వేణుగోపాల్, రాజు, యూసుఫ్, గణేష్, రవికుమార్, రాజయ్య, జోసెఫ్, అర్జున్, కృష్ణవేణి, ముజాహిద్, రాధిక, రేఖ, మంజుల, స్నేహలత, హరిత, విద్యారాణి, భాస్కర్, నరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'అయ్యప్ప సుమాంజలి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో రత్నాకర్‌రెడ్డి, కార్పొరేటర్ గుండె కల్పనానవీన్

మట్టెవాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప సుమాంజలి పుస్తకాన్ని సోమవారం వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆవిష్కరించారు. అయ్యప్ప సుమాంజలి అధ్యక్షుడు గండె నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ గండె కల్పనానవీన్, వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, ఈవో రత్నాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సముద్రాల సుదర్శనాచార్యులు, గుమ్మడవెల్లి ఆశ్రిత్‌శర్మ, పోల మహేష్ గురుస్వామి, బొమ్మల గుడి చైర్మెన్ కొమ్మిని రాజేందర్ గురుస్వామి, శ్రీరాముల సురేష్, దాసరి కృష్ణ, పుప్పాల శ్రీనివాస్, నూకరాజు అశోక్ శర్మ, ఆపూరుపల్లి శ్రీకాంత్, దయ్యాల కృష్ణ, చిట్యాల మధు, యాద మురళి, రాచర్ల జగన్, గని కిరణ్, అఖిల్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

వనప్రేమికుడు.. సమ్మయ్య

మొక్కలు నాటడం, సంరక్షణే ఆయన ధ్యేయం

- గోపాలమిత్రగా విధులు.. 25ఏళ్లుగా పర్యావరణ సేవలు
- 35వేలకు పైగా మొక్కలు నాటించి ప్రత్యేక గుర్తింపు



మాజీ మంత్రి సత్యవతి, నూతన వధు వరులతో మొక్కలు నాటిస్తూ (ఫైల్)



ద్విచక్ర వాహనంపై మొక్కతో సమ్మయ్య

ఆదర్శం

నెక్కొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వృక్ష సంపదే ఆయన ప్రాణం.. అందుకు గాను ఎలాంటి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమం జరిగిన అక్కడికి వచ్చే ముఖ్య అతిథులచే మొక్కలు నాటిస్తుతుంటారు వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామానికి చెందిన నల్లొండ సమ్మయ్య ఓ వైపు గోపాలమిత్రగా విధులను నిర్వహిస్తూనే.. 25 ఏళ్లుగా వరంగల్ జిల్లాలో పర్యావరణ పరిక్షణకు కృషి చేస్తూ వనప్రేమికుడిగా గుర్తింపుపొందారు. ఇప్పటి వరకు 35వేలకు పైగా మొక్కలు నాటించిన ఆయన వాటి సంరక్షణకు కూడా చర్యలు తీసుకునేలా కృషి చేస్తుంటారు. తొలుత నర్సంపేట డివిజన్‌లో.. తరువాత వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటడం ప్రారంభించిన సమ్మయ్య పలు సందర్భాల్లో హైదరాబ్యాద్‌లో జరిగిన కార్యక్రమాల్లోనూ పాల్గొని మొక్కలను నాటాడు. సకల జీవ రాశుల సంక్షేమానికి, కాలుష్య నివారణకు చెట్టు ముఖ్యమనే నినాదంతో ఆయన ఎక్కడ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలు జరిగినా ఆ ప్రాంతాలకు వెళ్లి ప్రముఖులతో మొక్కలు నాటించడం అలవాటు చేసుకున్నారు. ఈ క్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు పలువురు ప్రముఖుల నుంచి సత్కారాలు అందుకున్నారు.

పుట్టినరోజులు.. పెళ్లిరోజుల్లో..

ముఖ్యమైన రాజకీయ నేతల, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు మొదలు మండలస్థాయిలో ఉన్న ముఖ్యమైన వ్యక్తుల పుట్టిన రోజులు, పెళ్లి రోజులను గుర్తుంచ్యూకొని ఆ రోజున వారితో మొక్కలు నాటిస్తుంటారు సమ్మయ్య అలాగే జాతీయ నాయకుల వర్ధంతి, జయంతుల సందర్భంగా కూడా ఈ కార్యక్రమాలు చేపడుతుంటారు. నాటిన మొక్కలను ఎదిగే వరకు సంరక్షించేందుకు వాటి చుట్టు కంచెలను కూడా ఏర్పాటు చేస్తుంటారు. తనకు వెళ్లేందుకు కుదరకపోతే సదరు ప్రముఖులకు ఫోన్లు చేసి మొక్కలను నాటాలని, సంరక్షించాలని కోరుతుంటారు. సమ్మయ్య నర్సంపేట డివిజన్‌లోని వివిధ గ్రామాల్లో వృత్తి పరంగా గ్రామాలు తిరుగుతూ పశువులకు వైద్య సేవలను అందిస్తుండటమే కాకుండా గ్రామాల్లో నాటిన మొక్కలకు రక్షణ కల్పించి వాటిని వృక్షాలుగా ఎదిగే వరకూ శ్రమిస్తూటాడు.

పలు అవార్డులు అందుకున్న సమ్మయ్య

వన ప్రేమ్యికుడిగా గుర్తింపు పొందిన సమ్మయ్య గ్రీన్ ఇండియా చాలెంజ్, జీవ వైవిధ్య, జాతీయ మహానంది అవార్డు, జై భీమ్ ఫౌండేషన్ పురస్కార్, సోషల్ వర్కర్ ప్రశంసా పత్రం అందుకున్నారు.

ప్రభుత్వం సహకరిస్తే లక్షల్లో మొక్కలు నాటుతా..



మొక్కలు నాటడమే లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ దాదాపు 35వేల మొక్కలు నాటగా, వందల సంఖ్యలో మహావృక్షాలుగా ఎదిగాయి. అయితే 2025 వరకూ 60వేల మొక్కలు నాటుతాను. ప్రభుత్వం తన సేవలను గుర్తించి ప్రభుత్వం ఆర్థికంగా సహకారం అందిస్తే లక్షల మొక్కలు నాటుతాను.

- నల్గొండ సమ్మయ్య



సమ్మయ్యను నెక్కొండ పోలీసు స్టేషన్‌లో సన్మానిస్తున్న ఏసీపీ తిరుమల్ (ఫైల్)



నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో మొక్కలు నాటిస్తున్న సమ్మయ్య (ఫైల్)

జలేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

రెడ్డికాలనీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మార్గశిర ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం హనుమకొండ కాకాజీ కాలనీలోని జలేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పెద్ద కోవెలలో తిరుప్పావై పాశురాలు చదువుతున్న మహిళలు

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

- వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస పర్వం ఆరంభం
- జోరుగా తిరుప్పావై ప్రవచనాలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వైష్ణవ ఆలయాల్లో సోమవారం ఉదయం నుంచి ధనుర్మాస వేడుకలు ప్రారం భమైయ్యాయి. అండాల్ తల్లి అయిన గోదాదేవిని స్తుతిస్తూ గానం చేస్తున్న తిరుప్పావై పాశురాలతో ఆలయాల్లో తెల్లవారు జామునుంచే ఆధ్యాత్మిక శోభ ప్రారంభమైంది. సూర్యోదయానికి ముందే భక్తులు ముఖ్యంగా మహిళలు ఆలయాలకు చేరుకొని ధనుర్మాస వ్రతసేవల్లో పాల్గొంటూ రోజుకొక్కటి చొప్పున తిరుప్పావై పాశురాలను అను సంధానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో హనుమ కొండ రెడ్డికాలనీలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో కలకుంట్ల శ్రీనివాసాచార్య తిరుప్పావై ప్రవచనాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ జరిగిన తిరుప్పావై ప్రారంభ వేడుకల్లో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు, సంస్కృత పండితుడు శఠగోపాచార్య, వనం లక్ష్మీకాంతా రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శఠగోపాచార్య మా ట్లాడుతూ పరమ పవిత్రమైన గోదా చరితను శ్రీ వ్రతం పేరిట భక్తి శ్రద్ధలతో నెల రోజులపాటు వ్రతాన్ని ఆచరిస్తే సకల సుఖాలు కలు గుతాయని కోరిన కోరికలు తీరుతాయని శఠగోపాచార్య వ్యాఖ్యానిం చారు. గోదాదేవి ఐదువేల ఏళ్ల కింద తాను ఆచరించి లోకానికి అందించిన 30 పాశురాలే నెల రోజుల తిరుప్పావై పద్యాలని ఆయన చెప్పారు. హనుమకొండ రాగన్నదర్వాజలోని శ్రీ గోదా రంగనాయక ఆలయంలో వైభవంగా ధనుర్మాస వేడుకలు ప్రారంభమైయ్యాయి. ఆల య అర్చకులు కలకోట రాఘవచార్య, నర్సింహాచార్య ఆధ్వర్యంలోజరిగిన ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ చిన్నకోవెలలో ప్రధాన అర్చకులు చెరుకుపల్లి శ్రీనివాసాచార్య, ఏకశిలా పార్కు అభయాంజనేయస్వామి ఆలయంలో డింగరి శ్రీనివాసాచార్య, రెవెన్యూ రామాలయంలో శ్రీకాం తాచార్య, మిథిల నగర్ బాలసముద్రం కోదండ రామాలయంలో తిరుమలచార్య, ఏ టూ జడ్ వెంకటేశ్వరాలయంలో దేశికన్ స్వామి, దోనగుట్ట లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో పరాంకుశం గిరిధర్‌కృష్ణ, ఎన్‌జీవోస్ కాలనీలో వాసుదేవచార్య, తిరుప్పావై పాశురాలను భక్తులచే అనుసంధానం చేయించారు.

వేయిస్తంభాల ఆలయంలో

ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో మార్గశిర మాసంలో ధనుర్మాస వేడుకలు శివప్రీతికర సోమవారం ఇక్కడ లాంఛనంగా ప్రారంభించారు. శాస్త్రానుసారం శివకేశవులను ప్రీతికరమైన మాసం ధనుర్మాసమని ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. ఈ సందర్భంగా ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని పరమశివునికి లక్ష మారేడుదళాలతో ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో వెంటకయ్య పర్యవేక్షించారు.

లక్ష్మీప్రియకు జాతీయ అవార్డు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో అభినయ నృత్యభారతి ఈ నెల 13 నుంచి మూడు రోజులపాటు నిర్వహించిన 29వ జాతీయ నృత్య పోటీల్లో హనుమకొండకు చెందిన పెండ్యాల లక్ష్మీప్రియ జాతీయస్థాయిలో ప్రథమ బహుమతితోపాటు నృత్య కౌముది, బెస్ట్ యూత్ క్లాసికల్ అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా ఆమె గురువు బోంపెల్లి సుధీర్‌రావు, లక్ష్మీప్రియను ప్రత్యేకంగా అభినందించారు. ఈమెతోపాటు సుధీర్‌రావు మరో శిష్యురాలు ఆరాధరెడ్డి కూడా జూనియర్ విభాగంలో నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి సాధించడం విశేషం.



నృత్య విజేతలను అభినందిస్తున్న నాట్యాచారుడు సుధీర్‌రావు

భూమిలేని పేదలెందరో?

(5వ పేజీ తరువాయి)

ఈ నెల 28వ తేదీన అందిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో వ్యవసాయ కూలీల్లో హర్షం వ్యక్తమవుతోంది.

రూ.12వేల సాయానికి అర్హులెవరు?

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల హామీల్లో వ్యవసాయ కూలీలకు రూ.12వేల ఆర్థిక సాయం ఉంది. దీన్ని ప్రస్తుతం అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో వ్యవసాయ కూలీలకు ఆర్థికసాయంపై ప్రభుత్వం ప్రకటన కూడా చేయనుంది. అయితే భూమిలేని పేదలను గుర్తించేందుకు ప్రభుత్వం దేనిని ప్రామాణికంగా తీసుకుంటుందనేది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కూలీలను గుర్తించేందుకు ఏ ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వే నిర్వహించలేదు. 2014లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఇప్పటి వరకు బయటకు రాలేదు. ఆ రిపోర్టులు ఎక్కడ ఉన్నాయో కూడా ఎవరికి తెలియదు. ఇక ఇటీవల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో చాలా మంది వాస్తవ వివరాలతో నివేదికలు ఇవ్వలేదనే చర్చ జరుగుతోంది. ఈ రెండు సర్వేల్లో కూడా ప్రత్యేకంగా వ్యవసాయ కూలీలను గుర్తించే కాలం లేదు. ఇక ఉపాధి హమీ జాబ్‌కార్డులను ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉందా అనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 7.35లక్షల ఉపాధి హమీ జాబ్‌కార్డులున్నాయి. అయితే ఈ కార్డు ఉన్నవారిలో చాలా మందికి ఎంతో కొంత భూమి కూడా ఉంది. ప్రభుత్వం గుంట భూమి ఉన్న కూడా రైతు భరోసా ఇస్తుంది. ఈ పరిస్థితుల్లో జాబ్‌కార్డు ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయటం సాధ్యం కాదనే టాక్ వినబడుతుంది. దీంతో రూ.12వేల ఆర్థిక సాయానికి అర్హులు ఎవరనేది ఆసక్తికరంగా మారింది. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,787మంది రైతులకు చివరి సారిగా 2023-24యాసంగిలో రైతు భరోసా డబ్బులు జమయ్యాయి. జాబ్‌కార్డుదారులకంటే రైతు భరోసా తీసుకుంటున్న రైతులే ఎక్కువగా ఉన్నారు. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 4లక్షల నుంచి 5లక్షల మంది భూమిలేని పేదలుండే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రైతు సర్కారు గ్యారంటీ..

ప్రభుత్వం భూమిలేని పేదలకు రూ.12వేల సాయాన్ని అందించేందుకు కసరత్తు చేస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సుమారు రూ.600కోట్లు కేటాయించాల్సి ఉంటుందని అంచనా. ఉమ్మడి జిల్లాలో 4లక్షల నుంచి 5లక్షల వరకు వ్యవసాయ కూలీలు ఉండగా, ఒక్కొక్కరికి రూ.12వేల చొప్పున రూ.480కోట్ల నుంచి రూ.600కోట్ల వరకు ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా రెండు విడతల్లో 2,08,077 రైతు ఖాతాలకు సంబంధించి రూ.1,506.50కోట్ల రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేసింది. అలాగే 2023-24లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,787మంది రైతులకు గత యాసంగిలో రైతుభరోసా సాయం కింద రూ.907.98కోట్లు అందించింది. రైతుభరోసాను సంక్రాంతి నుంచి రూ.10వేల నుంచి రూ.15వేలకు పెంచుతుండటంతో ఈ సాయం రూ.15వేల కోట్లకు పెరగనుంది. ప్రతీ ఏటా రైతు భరోసా, భూమిలేని పేదలకు ఇచ్చే సాయం కలిపి సుమారు రూ.30వేల కోట్ల వరకు రైతులకు ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే వ్యవసాయ కూలీలకు అందించే సాయం మాత్రం రుణమాఫీ తరహాలో కాకుండా అర్హులైన ప్రతీ పేదకు ప్రభుత్వం అందించే రూ.12వేల ఆర్థిక సాయం అందాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దీంతో అర్హుల ఎంపిక కూడా రాజకీయ విమర్శలు లేకుండా పారదర్శకంగా ఉండాలని, అర్హుల్లో ఒక్కరికి కూడా అన్యాయం జరుగకుండా ఎంపిక ప్రక్రియ ఉండాలని ప్రభుత్వం భావిస్తుందని సమాచారం.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

50 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు

ఘనంగా కేఎంసీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వరంగల్ మెడికల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వీరంతా కాకతీయ వైద్య కళాశాలలో 1974వ సంవత్సరంలో వైద్యవిద్యనభ్యసించిన వారు. ప్రస్తుతం ప్రస్తుతం వారంతా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అనేక మంది వైద్య రంగంలో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. తాము ఇక్కడ చదువుకుని 50ఏళ్లయిన నేపథ్యంలో ఒక్కచోట కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. కాలేజీ క్యాంప్‌లోని ఎన్ఆర్ఐ హాలులో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వరంగల్‌తోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు హాజరయ్యారు. నాడు తాము చదువుకున్న క్లాస్ రూములు, ల్యాబ్‌లను, బెంచీలు, కుర్చీలను చూసి నాటి అనుభూతులను నెమరువేసు కున్నారు. ముున్ముందు పూర్వ విద్యార్థులకుగా తాము కళాశాల అభివృద్ధికి సహకరించాలని నిర్ణయించుకున్నారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ పోల నటరాజ్, డాక్టర్ కె.తిరుపతిరెడ్డి, డాక్టర్ ఎ.రవీంద్ర, డాక్టర్ కె.ప్రదీప్‌రెడ్డి ఏర్పాట్లు చేయగా ఈ కార్యక్రమంలో అప్పటి గురువులు డాక్టర్ పి.నరసింహారెడ్డి, డాక్టర్ శేఖర్‌రెడ్డి, డాక్టర్ బుచ్చిరెడ్డి, డాక్టర్ క్రాంతి రావు, డాక్టర్ దామోదర్ కౌశిక్, డాక్టర్ శశికుమార్, డాక్టర్ ఏకనాథం పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

- రంగశాయిపేటలో శబరిమలైని తలపించేలా పడిపూజ
- భక్తులతో కిక్కిరిసిన బీరన్న ఆలయం..



రంగశాయిపేటలో అయ్యప్ప పడిపూజ దృశ్యాలు

శంభునిపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ అయ్యప్ప నామస్మరణతో రంగశాయిపేట మార్మోగింది. రంగశాయిపేట, శంభునిపేట అయ్యప్ప సేవా పరపతి సంఘం ఆధ్వర్యంలో రంగశాయిపేటలో గల ప్రసిద్ధ బీరన్న ఆలయంలో సోమవారం అయ్యప్ప మహాపడి పూజ వైభవంగా నిర్వహించారు. ముందుగా రామాలయం నుంచి గురుస్వామి కంచ మల్లయ్య అయ్యప్ప విగ్రహాన్ని ఎత్తుకొని కురుమ కులస్థుల డోలువాయిద్యాలతో శోభాయాత్రగా బీరన్న ఆలయానికి చేరుకున్నారు. గురుస్వామి వెలిదె ప్రదీప్ శాస్త్రి చేతుల మీదుగా అభిషేకాలు నిర్వహించారు. 18 మెట్లపై ఆసీనులైన జ్యోతి స్వరూపిడికి పడులు వెలుగిస్తూ హారతి ఇచ్చారు. నారికేళ గురుస్వామి కళాకారులు కొల్లూరి యోగానంద్ తన పాటలతో బీరన్న ఆలయ ప్రాంగణాన్ని ఉర్రూతలూగించారు. శబరిమలైని తలపించేలా నిర్వహించిన ఈ పడి పూలో సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి, కర్నె రవీందర్, గురుస్వాములు కొల్లూరి యోగానంద్‌తో పాటు బజ్జూరి వీరేశం, కత్తి ఎల్లగౌడ్, అనుమాండ్ల రమేష్, గంద్రాతి కుమార్, పాల రంజిత్, శేర్ల అనిల్ కుమార్, కొండ్రెడ్డి నవీన్ రెడ్డి, కుంట శ్రీధర్, అడుప వేణు, కంచ మల్లయ్య, శెంకేశి శ్రీనివాస మూర్తి, బజ్జూరి ప్రభాకర్, సుధాకర్, దయాకర్, దామెరకొండ కర్ణాకర్, కత్తెరపల్లి వేణు, బొల్లెపల్లి సుదర్శన్, రాజశేఖర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



డోలు వాయిద్యాలతో అయ్యప్ప స్వామిని తీసుకువస్తున్న కురుమ కళాకారులు

కలెక్టర్ సారు.. ఆటలాడారు



సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడోత్సవాల్లో భాగంగా సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ప్రారంభ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా జ్యోతి ప్రజ్వలన చేసి, జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారులతో మమేకమై.. వారితో కలిసి వాలీబాల్, షటిల్, క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనడమే మొదటి విజయమని, విద్యకు ప్రాధాన్యమిస్తూనే క్రీడల్లో రాణించాలని సూచించారు. విద్యార్థుల మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని, మండల, గ్రామ స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి వచ్చిన క్రీడాకారులు అదే ఉత్సాహంతో రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, యువజన మరియు క్రీడల జిల్లా అధికారి వెంకట్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- జనగామ రూరల్ ఆంధ్రజ్యోతి



గౌరారం వాగులో పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

తాడ్వాయి అడవుల్లోకి పెద్దపులి

భద్రాద్రి జిల్లా వైపు నుంచి మళ్లీ రాక

తాడ్వాయి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ములుగు-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు అడవుల్లో పెద్దపులి సంచారం భయభ్రాంతులకు గురిచేస్తోంది. మూడు రోజుల క్రితం తాడ్వాయి మండలం పంబాపూర్ అడవుల నుంచి పక్కనే ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం రఘునాథపాలెం అడవిలోకి ప్రవేశించిన పులి రెండు రోజులు అక్కడే సంచరించింది. సోమవారం మళ్లీ మండలంలోని కాటినర్సాపూర్ అడవుల్లోకి వచ్చినట్టు నిర్ధారణైంది. ఇక్కడి గౌరారం వాగులో పులి పాద ముద్రలను గుర్తించినట్టు అటవీ శాఖ రేంజ్ అధికారి సత్తయ్య తెలిపారు. మగపులి తోడు కోసం ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి ఓ ఆడపులి వచ్చిందని చెబుతున్న అధికారులు దాని కదలికలను ట్రాక్ చేస్తున్నారు.

మంగపేట, కరకగూడెం, గుండాల, తాడ్వాయి అడవులు కలిసి ఉండగా ఐదు రోజులుగా ఇక్కడిక్కడే సంచరిస్తుండటంతో సమీప గ్రామాలు, ఆదివాసీ గూడాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ ఉత్పత్తుల సేకరణ, పశువుల మేత కోసం అడవుల్లోకి ప్రజలను వెళ్లకుండా నియంత్రిస్తున్న అధికారులు పులి సంచార సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ★★

ANDHRAJYOTHY

5

గ్రేటర్ వరంగల్

మంగళవారం 17 డిసెంబరు 2024



స్వామి అమ్మవార్ల దృష్టి నేరుగా అన్నం రాశిపై పడేవిధంగా అర్ధ మండపంలో ఏర్పాటు చేసిన కుంభం

మల్లన్న స్వామికి దృష్టి కుంభం

- ధను సంక్రమణం సందర్భంగా నిర్వహణ
- ఆరు రోజుల అనంతరం అర్జిత సేవలు ప్రారంభం

6



హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రానికొచ్చిన అభ్యర్థులు

ముగిసిన గ్రూపు-2 పరీక్షలు

- హనుమకొండ జిల్లాలో 48.61శాతం, వరంగల్‌లో 45.69శాతం అభ్యర్థుల హాజరు
- ఒక్క నిమిషం ఆలస్యంతో పరీక్షకు దూరమైన అభ్యర్థి

6

హనుమకొండ వేయిస్తంభాల గుడిలో రుద్రేశ్వరుడికి మారేడు దళ అర్చన ➤



వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

- వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస పర్వం ఆరంభం
- జోరుగా తిరుప్పావై ప్రవచనాలు

8

భూమిలేని పేదలెందరో?



వ్యవసాయ కూలీలకు ఆర్థిక భరోసా అందజేతకు ప్రభుత్వం సన్నాహాలు



- ఏటా రూ.12వేలు ఇవ్వనున్న రాష్ట్ర సర్కారు
- తొలి విడతగా ఈనెల 28న రూ.6వేలు జమ చేయనున్నట్టు ప్రకటన
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 7.35లక్షల మందికి జాబ్‌కార్డులు
- భూమిలేని పేదలను గుర్తించేందుకు ఎలాంటి సర్వే చేయని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,89,787 మందికి రైతుభరోసా
- ఏటా వ్యవసాయ కూలీలు, రైతు భరోసాకు రూ.30వేల కోట్లు ఖర్చు

జిల్లా.. లబ్ధిపొందిన రైతులు	వరంగల్	హనుమకొండ	జనగామ	మహబూబాబాద్	భూపాలపల్లి	ములుగు	మొత్తం
	1,54,822	1,45,044	1,79,735	2,14,685	1,16,171	79,330	8,89,787

గత యాసంగిలో రైతు భరోసా లబ్ధిపొందిన ఉమ్మడి జిల్లా రైతులు..

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

భూమిలేని పేదలకు ప్రభుత్వం రూ.12వేల ఆర్థిక సాయానికి సన్నాహాలు చేస్తోంది. రెండు విడతల్లో పేదలకు ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే భూమిలేని పేదలను ప్రభుత్వం ఎలా గుర్తిస్తుందనేది ఉత్కంఠగా మారింది. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి అనేక సర్వేలు నిర్వహించినా భూమి లేని నిరుపేదల వ్యవసాయ కూలీల గురించి ప్రత్యేకంగా సర్వే ఎప్పుడూ నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో భూమిలేని పేదల గుర్తింపు ప్రక్రియపై పలు అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 7.35లక్షల గ్రామీణ ఉపాధిహామీ జాబ్‌కార్డులు ఉన్నాయి. అయితే వీటి ఆధారంగా లబ్దిదారులను ఎంపిక చేస్తారా? లేక ప్రస్తుతం రైతుభరోసా తీసుకుంటున్న వారు కాకుండా.. మిగతా వారికి సాయాన్ని అందిస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. వ్యవసాయ కూలీలకు ఇచ్చే సహాయానికి అర్హులు ఎవరనేది ఆసక్తికరంగా మారింది.

కూలీలకు ఫస్ట్.. ఆ తరువాతే రైతుకు భరోసా

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రైతుభరోసాను ప్రకటించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరాకు యాసంగి, వానకాలం పంటలకు రెండు విడతల్లో రూ.10వేల ఆర్థిక సాయాన్ని రైతులకు అందించింది. అయితే తాము అధికారంలోకి వస్తే రైతుబంధు పథకం స్థానంలో రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. భరోసా ద్వారా రైతులకు ఎకరాకు రెండు విడతల్లో రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. అలాగే కౌలు రైతులకు కూడా ఇదే మొత్తాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. ఇక వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేల ఆర్థిక సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు గతేడాది డిసెంబరు 7న సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత యాసంగి పంటలకు సంబంధించి పాత పద్ధతిలోనే రైతులకు యాసంగి పంటకు ఎకరానికి రూ.5వేల చొప్పున సాయాన్ని అందించారు. అయితే వానాకాలం పంటలకు, ప్రస్తుతం ప్రారంభమైన రబీ పంటకు కాంగ్రెస్ ఇచ్చిన రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.15వేల చొప్పున ఇవ్వాల్సి ఉంది. అయితే భరోసా పథకాన్ని సంక్రాంతి నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. రైతు భరోసాకంటే ముందే వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీ మేరకు రూ.12వేల ఆర్థిక సాయాన్ని అందించాలని నిర్ణయించింది. రెండు విడతల్లో భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ.12వేల సాయాన్ని అందించనున్నారు. తొలి విడత రూ.6వేల సాయాన్ని

మిగతా 8వ పేజీలో...

గజ.. గజ..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్రమైన చలి

పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు.. వణుకుతున్న జనం



వాజేడులో చలిమంట కాగుతున్న యువకులు

ఉమ్మడి జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌డిగ్రీల్లో)

జిల్లా	గరిష్టం	కనిష్టం
ములుగు	28	11
వరంగల్	28	12
హనుమకొండ	27	12
భూపాల్‌పల్లి	28	12
జనగాం	28	13
మహబూబాబాద్	28	13


వరంగల్‌సిటీ / ములుగు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చలి పంజా విసురుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొద్ది రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గత మూడునాలుగు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో జనం వణుకుతున్నారు. వృద్ధులు, పిల్లలు, శ్వాసకోశ సంబంధ సమస్యలు ఎదుర్కొం టున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల సెల్సియస్ నమోదవగా.. రాత్రిపూట 12 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. ఇక ఉదయమైతే 9గంటల వరకు పొగ మంచు కురుస్తోంది. పనులపై బ యటకొచ్చే వారు, విద్యార్థులు, రైతు లు స్వెట్టర్లు వేసుకుంటున్నారు. మ రీ ముఖ్యంగా ములుగు ఏజెన్సీ వా సులు వణికిపోతున్నారు. నాలుగురోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమో దవుతున్నాయి. పగటిపూట గరిష్ఠం గా 26డిగ్రీలతో వాతావరణం పొడి గా ఉంటున్నా అర్ధరాత్రికి ఆ ఉష్ణోగ్ర తలు క్రమంగా పడిపోతూ 11 నుంచి 13డిగ్రీలు నమోదవుతోంది. గోదావరి పరివాహకంలోని ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో గోదావరి నదీతీరం, అభయారణ్యం ప్రభావంతోనే చలి తీవ్రంగా ఉంటోంది.

కాళోజీ కళాక్షేత్రానికి మరమ్మతులు

- గేటుకు తాళంవేసి పనులు చేస్తున్న నిర్మాణ సంస్థ

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన





కాళోజీ కళాక్షేత్రానికి మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

హనుమకొండ టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరుతో నిర్మించిన 'కాళోజీ కళాక్షేత్రానికి పగుళ్లు' అనే వార్త ఈ నెల 11న ఆంధ్రజ్యోతి మెయిన్ ఎడిషన్‌లో వచ్చిన విషయం తెలిసిందే. కాగా, ఈవిషయంపై కుడా అధికారులు పగుళ్లు కాదు అని ఖండించారు. సోమవారం కాళోజీ కళాక్షేత్రం గేటుకు తాళం వేసి పగుళ్లు ఏర్పడిన గోడలపై కళాక్షేత్రం నిర్మాణ సం స్థ ప్రతినిధులు సిబ్బందితో పగుళ్లకు మరమ్మతు పనులు చేపట్టారు. నవంబరు 19న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా కాళోజీ కళాక్షేత్రాన్ని అట్టహాసంగా ప్రారంభించి నెల రోజులు గడవకముందే కళాక్షేత్రానికి పగుళ్లు రావడంపై స్థానిక ప్రజలు కాంట్రాక్టర్, కుడా అధికారుల తీరుపై పలు విమర్శలు గుప్పించారు. రూ. 95 కోట్ల నిధులతో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రజలు చూడ డానికి అనుమతించడంలేదని విమర్శించారు. కుడా అధికారులు, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడమే గోడలకు పగుళ్లు ఏర్పడడానికి ప్రధాన కారణమని అందుకోసమే కళాక్షేత్రంలోకి ప్రజలను అనుమతించడంలేదని వివిధ ప్రజా సంఘాల నాయకులు, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు కళాక్షేత్రం నిర్మాణం చేపట్టిన కుడా ఇంజనీరింగ్ అధికా రులు కాంట్రాక్టర్‌పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగులు

- పబ్జీ ద్వారా పరిచయమై డబ్బు కాజేసిన ఓ కేటుగాడు
- అప్పులపాలై తీవ్ర ఒత్తిడితో యువకుడి ఆత్మహత్య
- వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలో ఘటన

6

సత్వర పరిష్కారం చూపండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- బల్దియా ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు సత్వర పరిష్కారం చూపాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్‌హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలపై స్పందించని అధికారులు, సిబ్బందిని ఇకపై సహించేది లేదని విధుల్లో అలసత్వం వహి స్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బల్దియాలోని కొన్ని శాఖల నుంచి తరుచుగా ఫిర్యాదులు వస్తున్నాయని టౌన్ ప్లానింగ్ అధికారులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఇటీవల నిర్వహించిన సమగ్ర కులగణన సర్వేలో సిబ్బంది పని తీరు సంతృప్తినిచ్చిందని అన్నారు. గ్రేటర్ వ రంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను

మిగతా 6వ పేజీలో...

నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదు

- పనితీరు మార్చుకోకపోతే చర్యలు
- సిబ్బంది తీరుపై నివేదిక ఇవ్వాలని ఆర్ఎంవోకు ఆదేశం
- సీకేఎం ఆస్పత్రి సందర్శనలో కలెక్టర్ హెచ్చరిక



నూతనంగా ఏర్పాటుచేసిన కొత్త మానిటర్లను ప్రారంభిస్తున్న కలెక్టర్

గిర్మాజిపేట, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదని వరంగల్ కలెక్టర్ సత్యశారద సీకేఎం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను హెచ్చరించారు. సోమవారం ఆమె ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఇటీవల ఆస్పత్రిలో జన్మించిన శిశువును ఎంజీఎంకు తరలించగా మృతి చెందడం, ఆస్పత్రిలో సెప్టిక్ ట్యాంక్‌లు నిండి డ్రైనేజీ పైప్‌లు లీకైన సంఘటనలు పత్రికల్లో రావడంతో ఆమె ఆస్పత్రిని తనిఖీ చేశారు. మొదట నేరుగా ఓపీ బ్లాక్‌కు వెళ్లి మహిళలతో మాట్లాడారు. ఓపీ బ్లాక్‌లో బాలింతలకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం నవజాతశిశు వార్డు, మదర్ వార్డులకు వెళ్లి వైద్య సేవలపై ఆరా తీశారు. అత్యవసర వైద్య పరికరాలు, వెంటిలేటర్లు లేకపోవడంతో శిశువులను ఎంజీఎంకు పంపుతున్నామని ఆర్ఎంఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి వివరించారు. అనంతరం ఫార్మసీకి వెళ్లి మందుల కొరతలేకుండా చూసుకోవాలని సూచించారు. బెడ్‌షీట్లు శుభ్రంచేసేందుకు అవసరమైన డెటాయిల్, బ్లీచింగ్ పౌడర్, కెమికల్స్ లేవని సిబ్బంది చెప్పడంతో ఎవో సాజిద్ అలీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెయినేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశిం చారు. శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ, కాంట్రాక్టర్ పనితీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ పర్యటిస్తున్న సమయంలో ఎలుకలు, కుక్కలు ఆస్పత్రి ఆవరణలో సంచరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆస్పత్రిలో థర్డ్‌పార్టీ కాంట్రాక్ట్ కింద పనిచేస్తున్న 86 మంది సిబ్బంది పనితీరుపై నివేదిక ఇవ్వాలని ఆర్ఎంవోను ఆదేశించారు. ఆస్పత్రిలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ మిషన్‌ను వెంటనే ఏర్పాటుచేయాలన్నారు. ల్యాబ్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, 2వ ఆర్ఎంవో డాక్టర్ సత్యజిత్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు నూతనంగా ఏర్పాటుచేసిన 2 మానిటర్లను కలెక్టర్ సత్యశారద ప్రారంభించారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 17 డిసెంబరు 2024
వరంగల్ రూరల్
• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

ఏబీవీపీ మహాసభలకు తరలిరావాలి

వర్ధన్నపేట, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23, 24, 25 తేదీల్లో సిద్దిపేట జిల్లాలో జరగనున్న అఖిల భారత విద్యార్థి పరిషత్ తెలంగాణ (ఏబీవీపీ) రాష్ట్ర 43వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెల్లం కార్తీక్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న ఏబీవీపీ 43వ మహాసభలకు విద్యార్థులు, నాయకులు, మేధావులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి జీవన్, సంయుక్త కార్యదర్శి సన్నీ, జశ్వంత్, హర్షవర్ధన్, శివాజీ, రోహిత్ పాల్గొన్నారు.



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఆధునిక పరికరాలతో అనేక ప్రయోజనాలు

- మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల
- 'మన అగ్రిటెక్' వద్ద డ్రోన్ ప్రదర్శన

వరంగల్ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునిక పరికరాలు వినియోగిస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయని, ముఖ్యంగా కూలీల కొరత, పెట్టుబడి ఖర్చు తగ్గుతాయని ఏనుమాముల మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల అన్నారు. సోమవారం మార్కెట్లో డ్రోన్ వినియోగంపై ప్రదర్శనఇచ్చారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. ఎకరా భూమిలో డ్రోన్ 15నిమిషాలలో పురుగుమందును పిచికారీచేస్తుందని, సమయం, డబ్బులు ఆదా అవుతాయన్నారు. ఏనుమాముల మార్కెట్‌లో ఉన్న మన అగ్రిటెక్‌సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ఆధునిక వ్యవసాయయంత్రపరికరాలను అందించడంఅభినందనీయమన్నారు. ఆధునిక పరికరాలతో నిరుద్యోగులు ఉపాధిపొందవచ్చని, డ్రోన్‌పై పెట్టినపెట్టుబడి ఆరు నెలల్లో తిరిగి వస్తుందని అన్నారు. ఆసక్తి ఉన్న వారు మన అగ్రిటెక్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రైతులు, అగ్రిటెక్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

వెదజల్లే సాగు.. లాభాలు బాగు

- పెట్టుబడి తక్కువ. అధిక దిగుబడి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



పంటపొలంలో వరివిత్తనాలను వెదజల్లుతున్న రైతులు

నర్సంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వెదజల్లే పద్ధతిలో వరిపంట సాగు సత్ఫలితాలను ఇస్తోంది. అదను సమయంలో కూలీలు దొరక్క ఇబ్బంది పడే సందర్భాల్లో ప్రత్యమ్నాయం వైపు చూస్తూ వెదజల్లే పద్ధతిపై రైతులు దృష్టిసారిస్తున్నారు. ఫలితంగా కూలీల ఖర్చు మిగలడమే కాకుండా పంట కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. నాట్లు వేయడం ప్రస్తుతం పాతతరానికే పరిమితమయింది. నేటి మహిళలు వరినాట్లు వేసేందుకు ఆసక్తిచూపడంలేదు. రైతులకు కూలీల కొరత ఇబ్బందికరంగా మారింది.

నాట్లకు పెట్టుబడి ఎక్కువ ..

సాంప్రదయ పద్ధతిలో నాట్లు వేస్తే ఎక రాకు కూలీలకు రూ.6వేల ఖర్చు వస్తుం ది. డీజిల్, ఎరువులు ధరలు పెరగడంతో సాగు పూర్తయ్యే వరకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40వేల వరకు పెట్టుబడి అవుతుంది. వెదజల్లే పద్ధతి లో ఎకరాకు 8నుంచి 10కిలోల విత్తనాలు సరిపోతాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. నారును పెంచి మళ్లీ నాటడంవల్ల వేర్లు తెగిపోవడంతో పిలకలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండదు. వెదజల్లే పద్ధతిలో నేరుగా వరి పెంచడం వల్ల దిగుబడి అధికంగా వస్తుంది. ఈ పద్ధతి అవలంబిస్తే పంట ఆరంభంలో మందులతో కలుపును నివారించవచ్చు. అదేవిధంగా సాధారణ సాగుకంటే 10నుంచి 15రోజుల ముందే కోతకు వస్తుంది. ఈ పద్ధతిపై ప్రభుత్వం విస్తృత స్థాయిలో ప్రచారం అవగాహన కల్పించి రైతులను ప్రోత్సహిస్తోంది. ఏఈ వోల ద్వారా రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించి వెదజల్లే, డ్రమ్ సీడర్‌పై అవగాహన కల్పిస్తున్నారు. పాత కాలం వరిసాగు కంటే వెదజల్లే పద్ధతి సులువుగా ఉంటుందని, అధిక దిగుబడి, అధిక ఆదాయం వస్తుండడంతో వెదజల్లే పద్ధతిపై వరిసాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. డ్రమ్ సీడర్ పద్ధతిలో కూడా వరిసాగుచేస్తే పెట్టుబడి తగ్గడంతో పాటు దిగుబడి వస్తుందని రైతులకు వ్యవసాయశాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

మెండు అశోక్, ఏఈవో, నర్సంపేట



నూతన సాగు విధానంలో భాగంగా వరిలో విత్తనం వెదజల్లే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాము. రైతులు ఈ పద్ధతిలో వరిసాగుచేసే విధంగా రైతు వేదికలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తునాము. వెదజల్లే పద్ధతిలో ప్రధాన సమస్య కలుపు యాజమాన్యం. ఆరుతడి పద్ధతిలో నీటి తడులు పెట్టడంతో కలుపు ఎక్కువగా పెరుగుతుంది. కలుపు నివారించడానికి విత్తనం వేసుకున్న మూడు రోజుల్లో కలుపు మందు ను చల్లుకోవాలి. అనంతరం 25 రోజులకు మరోసారి కలుపు మందు చల్లుకోవాలి. దీంతో కలుపు మొలకెత్తదు. అనంతరం సాధారణ సాగు మాదిరిగానే నీటిని కట్టడంతో కలుపు సమస్య తీరుతుంది.

మునిసిపాలిటీ ఏర్పాటుకు
మూడు గ్రామాలు ఓకే

- సందిగ్ధంలో మరో రెండు గ్రామాల ప్రజలు
- రేపు గుండ్రపల్లి గ్రామ సభ



నెక్కొండలో మునిసిపాలిటీ ఏర్పాటుకు ఆమోదం తెలుపుతున్న ప్రజలు

నెక్కొండ. డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నెక్కొండ మునిసిపాలిటీ ఏర్పాటుకు అధికారులు సోమవారం గ్రామ సభలు నిర్వహించగా మూడు గ్రామాల ప్రజలు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపగా, మరో రెండు గ్రామాల ప్రజలు గ్రామాల సమస్యలను పరిష్కరించాకే అమోదం తెలుపుతామంటూ అధికారులకు తెలిపారు. గుండ్రపల్లి గ్రామ సభను ఈ నెల 17న నిర్వహించనున్నట్లు అధికారులు చెప్పారు.

నెక్కొండ, పతిపాక, నెక్కొండ తండాలో నిర్వహించిన సమావేశాల్లో మునిసిపాలిటీ ఏర్పాటు కారణంగా ఇంటి పన్నులు, మంచినీటి కులాయిల పన్నులు ప్రస్తుతం కంటే రెండు రెట్లు పెరుగుతాయంటూ పలు సందేహాలను వ్యక్తం చేస్తూ అధికారులను ప్రశించారు. అభివృద్ధి పనులకు అనుగుణంగా పన్నులు పెరుగుతాయంటూ ప్రజలు అడిగిన పలు సమస్యలపై అధికారులు సమాదానం ఇచ్చారు. దీంతో సంతృప్తిని వ్యక్తం చేసిన మూడు గ్రామాల ప్రజలు మునిసిపాలిటీ ఏర్పాటుపై తమకు ఎలాంటి అభ్యంతరంలేదని అభిప్రాయ వ్యక్తం చేయడంతో పాటు ప్రజలు చేతులెత్తి ఆమోదం తెలిపారు.

స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న మహ్మద్ ఆజామ్

వర్ధన్నపేట రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లబెల్లి గ్రామంలో చమక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ ఆజామ్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. చదువు ద్వారానే ఏ లక్ష్యాన్నైనా జయించవచ్చనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. భవిష్యత్తులో ప్రపంచంతో పోటీ పడాలంటే ఇంగ్లీష్ ఎంతో ముఖ్యమనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్, హెచ్‌ఎం రమేష్, ఏఏసీ చైర్మన్ చెంగల శ్రీలత, ఉపాధ్యాయులు తాటికాయల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



పర్వతగిరిలో స్కూలు బ్యాగులతో విద్యార్థులు

పర్వతగిరి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్గుమళ్ల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో చందా శోభారాణి, రమేష్, రాహుల్ ఆధ్వర్యంలో 65మంది విద్యార్థులకు రూ.25వేల విలువగల స్కూల్ బ్యాగులను సోమవార ం పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నెక్కొండ మండలంలోని అప్పాల్‌రావుపేటలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శోభారాణి రూ.30 వేల విలువగల స్కూల్‌బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గాయపు లింగారెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పాక రమేష్‌బాబు, హెచ్‌ఎంలు శ్రీనివాస్, వెంకట రమణారెడ్డి, ఉపాధ్యాయులు రమాదేవి, జగదీష్, కళ్యాణి, మధుసూదన్, లలితాదేవి, సుభాషిణి, రామస్వామి, నవీన్, ప్రసాద్, కిషన్, చంద్రభాను, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండ్రోజుల పాటు భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

వర్ధన్నపేట రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాలకు సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీటికి అంతరాయం కలుగుతుందని సంబంధిత శాఖ సూపర్‌వైజర్ నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధర్మసాగర్ నీటి శుద్ధీకరణ కేంద్రంలో మరమ్మతుల కారణంగా నేటి నుంచి రెండు రోజుల పాటు నీటి సరఫరా నిలుస్తుందని, తిరిగి ఈ నెల 19 నుంచి యథావిధిగా సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు, అధికారులు సహకరించాలని కోరారు.

సమ్మెకు మద్దతు తెలిపిన ఉపాధ్యాయులు

సంగెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాథమిక, పాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో మద్దతు తెలియజేస్తూ నినాదాలు చేశారు. ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వంద రోజల్లో సమస్యలను పరిష్కరించి ఉద్యోగలను రెగ్యూలర్ చేస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను మర్చిపోయారని విమర్శించారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలుపుకోవాలని వారు డిమాండ్ చేశారు.

- చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని 11 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు మద్దత్తుగా మండలంలోని ఉప్పరపల్లి పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జయ, శశిధర్, సంతోష్‌కుమార్, బాలాజీరావు, మాధవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న పార్వతమ్మ

చెన్నారావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో ఎస్సై రాజేష్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందిం చారు. గురిజాల గ్రామానికి చెందిన పోదిల కుమారస్వామి అనే వ్యక్తి వాట్సాప్ గ్రూపుల్లో అసభ్యకరంగా పోస్టులు పెట్టడం సరికాదన్నారు. అతనిపై చర్యలుతీసుకోవాలని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తప్పెట రమేశ్, తూటి పావని రమేష్, భూక్య సురేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలి



పొనకల్‌లో సర్వేను పరిశీలన చేస్తున్న జడ్పీ సీఈవో

దుగ్గొండి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శంగా నిర్వహించాలని జడ్పీసీవో ఆర్.రాంరెడ్డి అన్నారు. మండలంలోని పొనకల్, లక్ష్మీపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సోమవారం జడ్పీ సీఈవో సందర్శించి పరిశీలనచేశారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఏలాంటి విమర్శలకు అవకాశం కల్పించకుండా సర్వేను నిర్వహించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో అరుంధతి, కార్యదర్శులు ఉన్నారు.

- ఖానాపురం (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని జడ్పీ సీఈవో రాంరెడ్డి అన్నారు. కొత్తూరులో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్లసర్వేను సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, ఎంపీవో సునిల్, పంచాయతీ కార్యదర్శ పులి శ్రవంతి, కారోబార్ కాసు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.
- పర్వతగిరి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏనుగల్లు, చింతనెక్కొండ, సీకే తండా, ఏబీ తండా, ఇస్లావత్‌తండా, పర్వతగిరి గ్రామాల్లో ఇందిరమ్మ లబ్దిదారుల కోసం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాలోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ సర్వేయర్లు ప్రతీరోజూ 50ఇండ్లను సందర్శించి వివరాలు సేకరించాన్నారు. డిసెంబరు 31లోపు సర్వే పూర్తిచేసి నివేదిక అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో పాక శ్రీనివాసులు, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.
- చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లాయిగూడెంలో అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల కోసం ఇంటింటి సర్వేను అధికారులు సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి, అవినాష్, ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు ఇంటింటికి తిరుగుతూ అర్హులను గుర్తించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాముల నగర సంకీర్తన



నృత్యం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్, అయ్యప్పస్వాములు

వర్ధన్నపేట, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కేంద్రంలో పెద్దఎత్తున అయ్యప్ప స్వాములు అత్యంత భక్తి శ్రద్ధలతో సోమవారం నగర సంకీర్తన చేపట్టారు. ఉదయం నుంచే అయ్యప్పస్వామి మాలధారు లు పెద్దఎత్తున పట్టణ కేంద్రానికి చేరుకుని వాయిద్యాల మధ్య గురు స్వామి ధీకొండ యుగేందర్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన చేపట్టడంతో పట్టణవీధులు మార్మోగాయి. భక్తులు స్వామివారి ఊరేగింపు రథానికి ఎదురేగి నీటితో ఆరగించి స్వాగతం పలికారు. అనంతరం వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని శివాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొండేటి అనిత, బీజేపీ నాయకులు కొండేటి సత్యం, గణేష్, మురళి, కంజర్ల మధు పాల్గొన్నారు.

నల్లబెల్లిలో ఘనంగా పడిపూజ



పడిపూజలో పాల్గొన్న బిజేపీ నేత డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి

సంగెం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లబెల్లి గ్రామంలో సోమవారం బీజేపీ నాయకుడు నేరేటి రాజు ఆధ్వర్యంలో పడపూజ ఘనంగా నిర్వహిం చారు. మండలంలోని అయ్యప్ప స్వాములు హాజరై అయ్యప్పను కొలిచారు. బీజేపీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి పాల్గొని పూజ చేశారు. ఆనంతరం రాజు ఇంటి అవరణలో కొబ్బరి చెట్టు నాటారు. కార్యక్ర మంలో నాయకులు మొలుగూరి శ్రీనివాస్, చంద్రమొగిలి, భూక్యా వెంకన్న, బానోతు రాజు, చిర్ర బాబు, నీరటి సారంగం, కాగితాల సాయికుమార్, యాకూబ్, బుర్రి ప్రసాద్, మామిడాల అనిల్ పాల్గొన్నారు

ఖోఖో పోటీల నిర్వహణకు విరాళం



విరాళం అందచేస్తున్న లక్ష్మీనారాయణ దంపతులు

గీసుగొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జనవరి 8 నుంచి 11వ తేదీ వరకు గీసుగొండ జడ్పీ పాఠశాలలో నిర్వహించే 57వ రాష్ట్రస్థాయి ఖోఖో చాంపియన్‌షిప్ పోటీల నిర్వహణకు గీసుగొండ రిటైర్డ్ బ్యాంకు మేనేజరు పెగళ్ల పాటి లక్ష్మీనారాయణ గీత దంపతులు రూ.50 వేల విరాళాన్ని సోమ వారం అందచేశారు. ఈ కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజర్ కోట రాంబాబు, జాయింట్ సెక్రటరీ స్వప్న, కర్ణకంటి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సంగెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో కాసర్ల రవీందర్ పరిశీలించారు. సోమవారం ఆయన సంగెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వసతులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కొమురయ్య పాల్గొన్నారు.

బీయూఏ డివిజన్ అధ్యక్షుడిగా రాజు



రాజు

ఖానాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బేకరి యూనియన్ అసోసియేషన్ (బీయూఏ) డివిజన్ అధ్యక్షుడిగా మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన ఎలగందుల రాజు (బేకర్స్ డన్ బేకరి)ను ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గొడిశాల అనిల్, కోశాధికారిగా ఎండీ ఆఫ్తాబ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నర్సంపేట డివిజన్ లో గల 23 బేకరి షాపులు యూనియన్ అసోసియేషన్‌లో భాగస్వామ్యం అయ్యాయని, వ్యాపార పరంగా యూనియన్‌లో ఎలాంటి సమస్యలు వచ్చిన తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో బేకరి యజమానులు షాకీర్, కాంతారాజ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకంపై అవగాహన

చెన్నారావుపేట, డిసెంబరు 16:(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థులకు పట్టు పురుగుల పెంపకంపై అవగాహన కల్పించారు. మండలంలోని అమీనాబాద్‌లో దారా రంజిత్ అనే రైతు పెంపకం చేస్తున్న పట్టు పురుగుల కేంద్రాన్ని విద్యార్థులు క్షేత్ర పర్యటన చేశారు. ఉపాధ్యాయురాలు కేతిడి గౌతమి పట్టు పురుగుల పెంపకాన్ని, రైతు ఆర్థికంగా ఎంత లాభాలను గటిస్తున్న విషయాన్ని వివరించారు. అలాగే రైతు విద్యార్థులకు సాగుచేస్తున్న పద్ధతులను వివరించారు.

తెలంగాణలో బీజేపీ జెండా ఎగరేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

గీసుగొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో బీజేపీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా పనిచేస్తామని పరకాల నియోజకవర్గ కన్వీనర్ ములక ప్రసాద్ అన్నారు. సంఘటన పర్వ్ సంస్థాగత ఎన్నికల నియామకంలో భాగంగా గీసుగొండలో బూత్ కమిటీల నియామకాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 159, 160, 161 బూత్ కమిటీల అధ్యక్షులుగా పాకనాటి శ్రీకాంత్, చాపర్తి నవీన్, కోట అనిల్‌లను నియమించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తి రమేష్, వెంకటేశ్వర్లు, కందికొండ రాజు, ప్రదీప్, సదానందం, ములక సత్యనారాయణ, పసుల దేవేందర్, బొడకుంట్ల ప్రభాకర్, ఏలియా, వటుకుల గోపి, రేవంత్ తదితరుల పాల్గొన్నారు.

కేదాసి మోహన్‌కు అంబేద్కర్ అవార్డు



మోహన్

గీసుగొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొడ్డుచింతలపెల్లికి చెందిన ఎమ్మార్పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 15న ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మోహన్‌కు బహుజన సాహిత్య అకాడమి (బీఎస్‌ఏ) జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అ అవార్డును అందచేశారు.

గొల్ల, కురుమల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

చెన్నారావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) అసెంబ్లీ సమావేశాల్లో గొల్ల, కురుమల సమస్యలను చర్చించాలని జీఎంపీఎస్ మండల కార్యదర్శి రవి అన్నారు. సోమవారం మండలంలోని ఖాదర్‌పేట, జల్లి, గొల్లపల్లి, చెన్నారావుపేట గ్రామాల్లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. గొల్ల, కురుమలకు ప్రత్యేక బడ్జెట్‌ను పెట్టాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కుండె కుమారస్వామి, పరికి మధుకర్, జక్క వెంకటేశ్వర్లు, కుండె రవి, గుంటి కుమారస్వామి, కుక్కల రజనికాంత్, బట్టమేకల రాజయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్య



సంతోష్ (ఫైల్)

నెక్కొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని అప్పల్‌రావుపేటలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మందపురి సంతోష్ (30)కి మూడేళ్లక్రితం సుజితతో వివాహం జరిగింది. అయితే సంతోష్ బ్రాందీ షాపులో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని షోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి అలవాటు పడిన సంతోష్ కొంత కాలంగా విపరీతంగా మద్యం సేవిస్తుండడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సంతోష్ ఇంట్లో ఎవరులేని సమయంలో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టానికి నర్సంపేటకు తరలించారు. కాగా, మృతుడికి పిల్లలు లేరని పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెల మృత్యువాత

నెక్కొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్లవాడ గ్రామంలో మేకల శ్రీనివాస్‌కు చెందిన గొర్రెల మందపై ఆదివారం అర్ధరాత్రి వీధికుక్కలు దాడిచేసిన ఘటనలో 15 గొర్రెలు మృతి చెందాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామంలోని శ్రీనివాస్ ఇంటి అవరణలో గొర్రెల మంద ఉండగా ఆదివారం అర్ధరాత్రి సమయంలో వీధి కుక్కలు దాడి నిర్వహించగా రూ. 2లక్షలు విలువైన 15 గొర్రెలు మృతి చెందాయి. కొన్ని గొర్రెలు తప్పించుకొని పారిపోయినాయి. గ్రామంలో వీధి కుక్కలు విపరీతంగా ఉండటంతో రాత్రి సమయంలో వీధులలోకి రావడానికి ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. కుక్కల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అప్పు చెల్లించలేదంటూ ఇంటిపై దాడి

నెక్కొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పరపతి సంఘం అప్పు చెల్లించలేదంటూ సంఘం సభ్యులు కొందరూ తన ఇంటిపై దాడి నిర్వహించి ఇంట్లోని వస్తువులను ఎత్తుకెళ్లారంటూ మండలంలోని అలంకానిపేటకు చెందిన తూల లింగరాజు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఆర్థిక పరిస్థితి బాగలేని కారణంగా సంఘం నుంచి తీసుకున్న రూ.80 వేలు చెల్లించేందుకు కొద్ది రోజులు గడువు అడిగినట్లు పేర్కొన్నారు. అయితే సభ్యులు ఎలాంటి గడువు ఇవ్వకుండా తన ఇంటిపైకి వచ్చి తన కిరాణం షాపులోని వస్తువులతో పాటు ఇంట్లో ఉన్న విలువైన వస్తువులను ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై విచారణ జరిపి న్యాయం చేయాలని ఆయన కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

దుగ్గొండి. డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కక్కెర్ల శరత్ తాటి చెట్టు నుంచి ప్రమాదవశాత్తు పడగా గాయలయ్యాయి. గీత కార్మికుల కథనం ప్రకారం.. కక్కెర్ల శరత్ రోజువారిగానే ఆదివారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడగా కాలుకు బలమైన గాయమైంది. గాయపడిన శరత్ వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గాయపడినగీతకార్మికుడిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు బొమ్మగాని లక్ష్మణ్‌గౌడ్, తొగరు విద్యాసాగర్, స్వామి, మురళి, కక్కెర్ల రాంబాబు, సదయ్య కోరారు.

గుట్కాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

వర్ధన్నపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిషేధించిన అంబర్, గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వర్ధన్నపేట పట్టణానికి చెందిన మహ్మద్ బాబా నిషేధిత అంబ ర్, గుట్కాలను నిల్వచేసి విక్రయాలు జరుపుతున్నారని సమా చారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. ఈ దాడిలో సుమారు రూ.7,620విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

గీసుగొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి ధర్మారం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శివనగర్‌కు చెందిన గర్రెపల్లి కృష్ణమూర్తి అతని భార్య కళావతికి తీవ్రగాయాలు అయ్యాయి.పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణమూర్తి దంపతులు వారి బంధువు అంత్యక్రియలకు మహబూబాబాద్‌కు ఆదివారం కారులో వెళ్లారు. అంత్యక్రియల అనంతరం అదే రోజు రాత్రి తిరిగివస్తుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో కృష్ణమూర్తి కుడిచేయికి తీవ్రగాయం కాగా కళావతి ఛాతిలో బలమైన దెబ్బలుతగిలాయి.సీఐ మహేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కకాటుతో వృద్ధుడికి గాయాలు

సంగెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గవిచర్లలో సోమవారం ఉదయం ఓవృద్ధుడిని కుక్క కరిచింది. పోషాల కొమురయ్య అనే వృద్ధుడు బస్టాండ్‌కు వెళుతుండగా రోడ్డుపైన ఉన్న కుక్క కొమురయ్య మోకాలి కింద భాగాన కొరకడంతో మాంసం ఊడి వచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, గ్రామంలో కుక్కల బెడన ఎక్కువైందని, ప్రధానంగా విద్యార్థులు, కూలీలు కుక్కలను చూసి భయపడుతున్నారని గ్రామస్థులు తెలిపారు.